ఆంధ్రమహిళ



NOVEMBER '58 ANDHRA MAHILA 37 NAYE PAISE

ప్రపంచ బాలల దినం: నవంబరు 14



పిల్లలంటే మల్లి మొగ్గలు
తల్లి మనసే విరిసి వెన్నెల
లల్లుకొను జాబిల్లి నిగ్గులు
పిల్లలంటే మల్లి మొగ్గలు



ఆంధ్రమహిళ

సంపుటి 14 :: నవంబర్ '58 :: సంచిక 11

వ్యవస్థాపకురాలు

శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

సంపాదకురాలు

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

ముద్రణ

ఆంధ్ర మహిళా ప్రెస్

విషయసూచిక

ముఖచిత్రం : భారత ప్రధాని.

భావనాతీతుడు

పాప వినిర్మూల ప్రళయ భయంకర
ఉగ్రమహోజ్జ్వల విగ్రహుండు

అతులిత కరుణాకలిత లలిత సుశీత
లానంద మయ సుధా ధాముడేమొ

ప్రేమ రసోన్మత్త ప్రేయసీ లాలిత
ముగ్ధమనోహర మూర్తి యేమొ

వాఙ్మనోతీతమై వర్ణింపగారాని
దేదీప్యమయ దివ్యదీప్తి యేమొ

అదియొ, నిదియొ, యేదొ విదితమౌన మదిని
భయదయానురాగ భరితదివ్య
భవ్యమూర్తి యేమొ భావనాతీతుడు
భక్తి ప్రేమ పాశ బద్ధుడౌర !

— ఎ. మంజులాదేవి



ఆంధ్రమహిళ

సంపుటి 14 :: నవంబరు '58 :: సంచిక 11

భాగ్యవిధాత

భారతావని దర్శనానికై హృదయంవిప్పి ఒకసారి పరిశీలించి చూడండి. ఏ రాష్ట్రంలోనైనా ప్రాముఖ్యంగల వ్యక్తులు ఆయా రాష్ట్రాల తలమానికాలుగా, ముఖ్యమంత్రులుగా రాణిస్తున్నారు. భారతదేశం దూరతీరాల కలయికకి ఆటపట్టు. దృక్పథ విభేదాలకి మూలవిరాట్టు. అటు అత్యుత్తమం యిటు అతిస్వల్పం...అన్నీ ఒక్క బిగిని చూడగలం యీ దేశంలో. భౌతికంగా అతి విస్తృతం అయిన రష్యా మినహా ఐరోపా అంతటిదేశం. భౌతికంగా, ఆధ్యాత్మికంగా ప్రపంచ శిఖరం అనతగ్గది మన భారతావని. అటువంటి దేశానికి సారథ్యం వహించవలసిన పెద్దల ఆధ్యాత్మిక నైతిక ఔన్నత్యం కొనియాడతగ్గది.

ఈ శతాబ్దపు పునాదులలో మన ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ ఒకరు. భారత జనబాహుళ్యంచేత ముద్దుగా పండిట్‌జీ అని పిలువబడుతూ, అశేషుల ఆదర అభిమానాలకి పాత్రుడైన వ్యక్తి.

నవంబరు 14, 1889 లో విద్వత్కుటుంబం అయిన కాశ్మీర బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి ఉన్నతవిద్యను విదేశాలలో నభ్యసించారు. బారిస్టరుగారయి 1912 లో యిండియాకు తిరిగివచ్చి అల్హాబాదులో ప్రాక్టీసు ప్రారంభించారు.

1918 లో ఆలిండియా కాంగ్రెసు కమిటీలోచేరి దరిదాపు నాల్గుదశాబ్దాలపాటు ఆ సభ్యత్వాన్ని నిలపెట్టుకున్నారు. దేశభక్తి ప్రపూరితుడైన ఈయనకి దేశం మినహా యింకో వ్యాపకం లేదు. దేశసేవకోసం స్వాంతసుఖాన్ని నిరభ్యంతరంగా ధారపోసిన ధీరుడు. దేశ స్వాతంత్ర్యంకోసం అసాధారణ ప్రజ్ఞతో పోరాడి, అనేక సంవత్సరాలు జైలులో గడిపారు. కారాగారవాసంలోనే దరిదాపు రెండువేల పుస్తకాలు చదివారు. ఈ జ్ఞాని రచించిన అనేక పుస్తకాలలో "డిస్కవరీ ఆఫ్ ఇండియా" అద్భుత గ్రంథం.

పండిట్‌జీ భారతావనికి ఇంటా బయటా సంపాదించిపెట్టిన ఘనకీర్తి యింతా అంతా కాదు. దాని విలువ అమూల్యం.

ప్రపంచపు ఏమూలనున్నా సరే పీడితజన పక్షపాతి పండిట్‌జీ. ప్రజాస్వామ్య సంవిధానాలను ప్రోత్సహించే రాజకీయవేత్త. అంతర్జాతీయ రంగంలో ప్రాముఖ్యం వహించిన యీవ్యక్తి అసాధారణ మానవప్రేమ కలవాడు. నడచిన బాటవెంట వెలుగులు విరజిమ్ముతూ మానవతకి చిహ్నాలుగా నిలచే చేతలూ మాటలద్వారా ప్రజానీకానికి ఆరాధ్య దైవం అయాడు పండిట్ నెహ్రూ. మహిళలపట్ల వీరి సానుభూతి అపారం. వీరి జన్మదినంనాడే ప్రపంచ బాలల దినంగా ఉత్సవాలు జరపడం సంతోషప్రదం. పండిట్‌జీకి బాలలంటే అంతప్రేమ. పిల్లలమధ్య పిల్లవాడై పెద్దలమధ్య మేధావియై నిలచే పండిట్‌జీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిద్దాం.

★

రాజకీయాలు

పాకిస్తాన్‌లో ప్రజా పరిపాలన పోయి సైనిక పరిపాలన ఏర్పడ్డం, శోచనీయమైన పరిస్థితి. రాజ్యాంగానికి స్వస్తి చెప్పారు. పార్లమెంటు శాసన సభలు రద్దయి పోయాయి. రాజకీయ పార్టీలన్నవే నిషేధింపబడ్డాయి. మంత్రి వర్గంలో ఏర్పడ్డ ప్రతిష్ఠంభనవల్ల అధ్యక్షుడు మీర్జా యిటువంటి అతి తీవ్రమైన చర్య తీసుకొన్నాడు. దేశం మొత్తంమీద సైనిక శాసనం ప్రకటితం అయింది. హఠాత్తుగా అర్థరాత్రివేళ యిటువంటి తీవ్రమైన చర్య తీసుకోవడంతో అనేక ఊహాపోహలు బయలుదేరాయి. హఠాత్తుగా రాజకీయ వాదులుగా మారిన కొందరు ఉద్యోగుల తిరుగుబాటే యిదని ఢిల్లీ వర్గాలు వ్యాఖ్యానించాయి–రాజకీయాలు అతి నీచ స్థితికి దిగజారిపోయిన మాట వాస్తవమే. పాకిస్తాన్ రాజకీయ వాదులలో పదవీవ్యామోహం. స్వార్థపరత్వం కోసం వారు చేయరాని పనులు చేస్తూ, నీతినియమాలకు స్వస్తి చెప్పి మానమర్యాదలకు దూరమై దేశ గౌరవాన్నే మంట కలుపుతున్నారన్నది అధ్యక్షుడు ఇస్కందర్ మీర్జా వాదన. వారి వాదన అక్షరాలా సత్యాన్నే చాటి చెప్తాందనడం అబద్ధం కాదు. కాని యిటువంటి నైతిక పతనం సరికొత్త పరిణామం ఏమీ కాదు; దేశంలో సాధారణ ఎన్నికలు జరిగినట్లయితే, ప్రజలే యీ అవకాశ వాదులకి రాజకీయ వేత్తలకీ చక్కటి గుణపాఠం చెప్పి వుండేవారు. కాని ఇలా చేయక మీర్జా సైనిక పరిపాలనను ప్రకటించడం ఆశ్చర్యమే. ముఖ్యమంత్రి ఫిరోజ్ ఖాన్‌నూన్ మంత్రివర్గం నిలబడి వుంటే దానివల్ల ఏర్పడే సమస్యల పరిష్కారానికి రాజ్యాంగం తోడ్పడేది. రాజకీయ వాదుల కీచులాటలవల్ల ప్రభుత్వస్థాపనే కష్టం అయే పక్షంలో ప్రభుత్వ బాధ్యతలు తనే స్వీకరించి వచ్చే ఫిబ్రవరిలో ఎన్నికలు జరిపించి ఉండవచ్చు మీర్జా, కాని యీ మార్గాలని కాదని దేశంలో సైనిక నియంతృత్వం నెలకొల్పడంటే అతనే ఏవో శక్తులకు లోబడినాడేమో అన్ని అనుమానం రాకమానదు.

ఏది ఎలా వున్నా కుళ్ళు కుచ్చితాలతో లోపాయికారీ తగాయిదాలతో కలుషితమైన రాజకీయ పార్టీలకిటువంటి దెబ్బ ఒకటి అవసరం అంటారు కొందరు అతి వాదులు. కాని ప్రజాస్వామ్యం ఏ దేశ ప్రజేనా కోరేది కదా? దాని కోసం కదా నాగరిక ప్రభుత్వాలు, ప్రజలు పాటుపడుతున్నది. వాటినన్నిటినీ పక్కకు నెట్టి సైనిక పరిపాలన తప్పనిసరి చేసుకొన్న పాకిస్తాన్‌కి నిజంగా అవమానమే శరణ్యం. దొంగ రవాణా వ్యాపారులని, రకరకాలనల్ల బజారు వర్తకులని, ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్న వ్యాపారులని, రాజకీయాలను రొంపిలోకి దించుతూన్న, దించిన అనేక మంది పెద్ద మనుషులని పాకిస్తాన్ సైనికాధికారి నిర్బంధించారు. ఈ సైనిక పరిపాలనా ఫలితాలు, ప్రభావాలు ఎలా వుంటాయో అన్న దానికై వేచి చూడాలి.

♦ ♦ ♦

పత్రికా విలేఖరుల గోష్ఠిలో మాట్లాడుతూ ప్రధాని నెహ్రూ పాకిస్తాన్, బర్మాల పరిస్థితి యిండియాలో ఎన్నడూ రాబోదని అన్నారు. అంతే కాకుండా, బర్మా ప్రధాని అనుసరించిన విధానం ప్రజాస్వామిక బద్ధమైన దేనని కూడా నెహ్రూ పండితులు వివరించారు.

అతి ప్రాచీన కాలం నుంచీ వస్తున్న సంప్రదాయాలనే గాంధీజీ పునరుద్ధరించడం వల్లనే మన దేశంలో ప్రజాస్వామ్యం జయప్రదం అయింది. అందువల్లే పాకిస్తాన్ బర్మాల స్థితి మనకు వచ్చే అవకాశము లేనేలేదు అన్నారు.

పాకిస్తాన్‌లో సంభవించిన మార్పులు అతి ముఖ్యమైన వనీ, వాటిని జాగ్రత్తగా పరిశీలించ వలసిన ఆవశ్యకత వుందని వివరిస్తూ, యీ మార్పులు పాకిస్తాన్‌కే కాక, ఇతర దేశాలకు సహితం అతి ముఖ్యం అయినవి కాగల వని సూచించారు ప్రధాని. ఇండోపాక్ విషయాల చర్చలు కష్టం కావనీ ఆ దేశంరో ఏ ప్రభుత్వం వుంటే దానితోనే భారత ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు.

పాకిస్తాన్‌లో జరిగిన సంఘటనలకు బర్మాలో జరిగిన వాటికీ చాలా వ్యత్యాసంవుంది. బర్మాలో ప్రజా స్వామ్యానికి వ్యతిరేక చిహ్నాలు లేవు. బర్మా ప్రధాని ఉనూ తీసుకొన్న చర్యలు తాత్కాలికమైనవి మాత్రమే. ఎన్నికలు జరగడానికి ముందు తాత్కాలికంగా తీసుకొన్న చర్యలవి అదికాక, ఈ చర్యలు ప్రతిపక్షుల ఒప్పందంతోటీ. సహకారంతోటీ తీసుకోపడ్డాయి. ఇండియా సరిహద్దు దేశాల రెండింటిలో యీలా సైనిక ప్రభుత్వాలు స్థాపితం అయి వుండగా, 'యీ అంటువ్యాధి మనకి రాకుండా ఎలాగ చేస్తారు? అంటూ ఒక పత్రికా విలేఖరి ప్రశ్నించగా, మన ప్రజా స్వామ్యపు "అంటువ్యాధి ఆయా దేశాలకు. వ్యాపించుతుంది, అన్నారు ప్రధాని. ఛలోక్తిగా, శుభం. అలాగే జరగాలని ప్రజల కోరిక.

♦ ♦ ♦

25 లక్షల జనాభాగల ఫ్రెంచిగినీ రిపబ్లిక్‌గా ఆవత ఎంచింది: టెరిటోరియల్ అసెంబ్లీ ఏ శాసన సభగా రూపొంది రాజ్యాన్ని తయారుచేస్తుంది. పదకొండుగురు సభ్యులతో మంత్రివర్గం ఏర్పడుతుంది.

జనరల్ డిగాల్ కొత్త రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఓటు చేసిన ఏకైక దేశం ఫ్రెంచిగినీ. ఫ్రెంచిగినీలో 25 లక్షల మంది జనాభా. స్వతంత్రం పొందిన యీ చిన్ని రాజ్యం, ఎన్నో ఆర్థిక సమస్యలను ఎదుర్కోవలసి వుంటుంది. అయినా ప్రజలలో ఉత్సాహం, ప్రభుత్వం నేర్పరి అయిననాడు యీ కష్టాలు కలకాలం నిలవవు. స్వేచ్ఛ శాశ్వతంగా నిలుస్తుంది.

♦ ♦ ♦

కొత్తగా నెలకొల్పబడిన అభివృద్ధి నిధినుండి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మరో పదికోట్ల డాలర్ల రుణాన్ని అమెరికా భారత దేశానికి యివ్వగలదని నిధి మేనేజింగ్ డైరెక్టరు తెలవిచ్చారు.

యీ రుణంతో కొనబోయే యంత్ర సామగ్రి కేవలం అమెరికానుండే దిగుమతి చేసుకోనవసరంలేదు. డాలర్ల రూపంలో యిచ్చినా యీ రుణాన్ని రూపాయలలో చెల్లించే అవకాశం కూడా కల్పించారు,

అభివృద్ధి నిధినుండి యివ్వబడే యీ రుణాలు దీర్ఘకాలికమైన వైపునుండి ఇరిగేషన్ రోడ్లు ఓడరేవుల అభివృద్ధి మొదలైన పథకాల సహాయానికి వినియోగింపబడతాయి. భారత ప్రభుత్వంతో సంప్రదించి అవసర వివరాలను నిర్దేశించుకొన్నతరువాత యీ రుణం యివ్వడం ప్రారంభం అవుతుందని యీ నిధి మేనేజర్ డైరెక్టరు పత్రికా విలేఖరులతో అన్నారు.

♦ ♦ ♦

వ్యక్తిగత భూకమతాలు పరిమితంచేయబడేవిధంగా ఈరాక్ ప్రభుత్వం భూసంస్కరణలను తేదలచినట్లు ప్రకటించింది. చట్టప్రకారం కాలువక్రింద సాగయ్యేభూమి గరిష్ట కమతం రెండువందల యాభై ఎకరాలు వర్షాధారపు భూమి ఐదువందల ఎకరాలు. ఈ గరిష్ట ప్రమాణాలకి హెచ్చుగ వున్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటుందనీ, చట్టధిక్కారాన్ని ప్రభుత్వ ఏమాత్రం సహించదనీ, మంత్రి అబ్దుల్ కరామీ ప్రకటించారు.

♦ ♦ ♦

గతమాసం ప్రారంభంలో యావద్భారతమే కాకుండా విదేశాలుకూడా బాపూజీ దివ్య స్మృతి చిహ్నంగా వుత్సవాలూ, సభలూ, మొదలయినవి జరిపించాయి. ఈ శతాబ్దంలో అవతార పురుషునిగా ఆరాధింపబడిన వ్యక్తి మన బాపూజీ. ప్రజలలో గాంధీజీ సూత్రాలను పరివ్యాప్తం చేయడానికిగాను గాంధీ జయింతి సందర్భంగా జిల్లాలలో పదయాత్రలు సాగించారు మంత్రులూ తదితర కాంగ్రెసు పెద్దలూ. నైతిక క్రమ శిక్షణ అలవరచుకొని ప్రజలకు ఆదర్శ ప్రాయులుగా వుండాలని గాంధీజీ కోరేవారు. వారి కోరిక వమ్ము కాకుండా చూడవలసిన ఆవశ్యకత యీ పెద్దలందరి మీదా వుంది. ముక్కోటి

హృదయాధి దేవత గాంధీజీ కాని వారి సూత్రాలని ఆచరణలో పెట్టుతూన్న వారి సంఖ్య చాలా స్వల్పమే. యీ సంఖ్యము దేశజనాలూ, సంఖ్యతో ఐక్యం చేసే ప్రయత్నం చేయాలి గాంధీవాదులు, భక్తులు.

♦ ♦ ♦

కాతలిక్ క్రైస్తవ మతాధిపతి పోప్ పయుస XII కాలధర్మం చెందడంతో, శాంతి కాముకులకు తీరని లోటు ఏర్పడిందనే చెప్పాలి. శాంతి కాముకుడైన పోప్ పయిస్ చూరగొన్న గౌరవాదరణాలు ప్రపంచంలో యింకే యితర వ్యక్తీ చూరగొనలేదనడం అతిశయోక్తి కాదు. భీకరసంగ్రామాలను కళ్ళచూచిన యీయన కమ్యూనిజం అన్న, యుద్ధ కాముకత అన్న భరింపలేకపోయే వాడు. సూయజ్ కాల్వ తగాదా సందర్భంలోనూ, హంగేరీలో కమ్యూనిష్టులు నిర్బంధ విధానాన్ని అమలు చేసినప్పుడు పోప్ పయిస్ శాంతి స్థాపనకోసం విజ్ఞప్తులు చేశారు. అణ్వస్త్రాల పరీక్షలను నిరశించారు. ఇవి సర్వనాశనానికి దారి తీస్తాయని ఆయన అన్నారు. 1957 లో కమ్యూనిష్టు దేశంలోని క్రైస్తవులు పఠించడానికి అనువైన ప్రత్యేక ప్రార్థనలు రచించారు. భారతదేశం పట్లా భారతీయులపట్ల పోప్ పయిస్‌కి అవాజ్యమైన అభిమానం వుండేది.

♦ ♦ ♦

అక్టోబరు 24 నాడు దేశం మొత్తంమీద యునైటెడ్ నేషన్స్ డే జరిపించారు. రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, యీ సందర్భంలో ప్రసంగిస్తూ, ప్రపంచ శాంతిస్థాపనకు నిరంతరం కష్టపడుతూనే వుండాలని ఆ శ్రమలో యునైటెడ్ నేషన్స్ ఎంతేని పాలు పంచుకొంటుందనీ అన్నారు. ప్రతి సంవత్సరం యీ రోజు ఘనంగా జరిపించి పదమూడు సంవత్సరాల క్రితం ఎ ఏ సూత్రాల ఆధారంగా యీ సంస్థ నెలకొల్పబడిందో వాటిని పునరుద్ఘాటించుకుంటూ, సర్వ శక్తులూ యీ సంస్థ పురోభివృద్ధి కోసం, శాంతి స్థాపనకోసం కేంద్రీకరింపబడాలని కోరడం సంతోషింప తగ్గది.

బలవత్తరమైన దేశాలు ప్రపంచ యుద్ధానికి నాంది పలుకకుండా, చూడడం యీయు. ఎన్. తన ప్రథమ కర్తవ్యంగా యెంచి వ్యవహరిస్తూంది. అంతేకాక, యీ భూ భాగంమీద మానవుడు పుట్టినది మొదలు ఏదో విధంగా మనుకుంటూ వస్తున్నాడు. యుద్ధ భయం భాయిలనీడనేమనినా అనేక కష్టనష్టాలకు గురి అయినా బ్రతుకు భారం నెట్టుకుంటూ వస్తున్నాడు. దేశాల మధ్య రాజ్యాల మధ్య స్వార్థంపెరిగి మానవమనుగడకే ముప్పువాటిల్లే విషమ పరిస్థితులు ఏర్పడి యుద్ధోన్మాదుల భయంకర స్వరూపాలనే కాదంటూ, శాంతి భద్రతలకోసం ఆ క్రందనలు చేస్తూనేవున్నాడు. శాంతి భద్రతలకోసం వేసిన కేకలు ఏనాడూ వమ్ము కాలేదు. అవి ఎప్పటికీ అడవి కాచిన వెన్నెల కావు. మానవ ధర్మం మానవ మనుగడ మానవ సౌభాగ్యం....అన్నీ ఎలా బ్రతుకుతూ వస్తున్నాయో, శాంతి భద్రతలపట్ల ఉత్సాహంకూడా అలాగే మనుతుంది. ఈ రంగంలో యునైటెడ్‌నేషన్సు చేయకలిగినది చాలావుంది. యుద్ధవిరమణ ప్రయత్నాలుతో పాటు మానవ సౌభ్రతృత్వానికికూడా ప్రయత్నాలు బలవంతం చేయాలి.

♦ ♦ ♦

ఎన్నడూ లేని ప్రపంచ ఖ్యాతి నేడు లిటిల్ రాక్‌కి వచ్చింది. యీ చిన్న రాష్ట్రి గవర్నరు జాతివిచక్షణను కొనసాగించి తీరాలన్న సంకల్పంతో నీగ్రో బాలబాలికలకి తెల్లవారి స్కూళ్ళలో స్థానం లెకుండా చేశాడు. కాని ప్రభుత్వం కలుగచెసుకొని ఫెడరల్ సైనికుల సహాయంతో నీగ్రో పిల్లలని స్కూళ్ళలో ప్రవేశపెట్టారు. దానికి బదులుగా, స్కూళ్ళనే బాయికాట్ చేసి ప్రైవేటు సెగ్రిగేటడ్ స్కూళ్ళని ప్రారంభిస్తామని బెదరించారు. కోర్టులో ఘోరాఘోరీ యుద్ధం ఒక పక్కనుంచి జరుపుతూంటే, ప్రపంచంలో నాగరిక దేశాలన్నీ లిటిల్ రాక్ లోని విచక్షణ విధానాన్ని గర్హించాయి. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక కమిటీలో ఇండియా ఒక తీర్మానాన్ని ప్రతిపాదించితే దానిని అమెరికా ఆమోదించడం శుభ చిహ్నం. ఇన్నాళ్ళూ దక్షిణాఫ్రికాలోని విచక్షణ విధానాన్ని తను ఆమోదింపకపోయినా ఎన్నడూ దాన్ని ఖండించే ప్రయత్నం అమెరికా చెయ్యలేదు. ఇలా యిప్పుడు చేయడం నిజంగా శుభసూచకమేకదా. పదేపదే విజ్ఞప్తులను

చేసిన జాతివివక్షణకు స్వస్తి చెప్పని దక్షిణాఫ్రికాని ఖండించాలన్న దేశాలతో అమెరికా ఏకీభావించదన్నారు అమెరికా ప్రతినిధి. జాతివిద్వేష విషయాలలో దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఎంతటి తీవ్ర చర్యలని తీసుకొంటుందో ప్రపంచ ప్రజలందరికీ తెలిసినదే. కాని యీ శక్తిని అరికట్టవలసిన బాధ్యత ఐక్యరాజ్య సమితిమీదా, అమెరికా మీదా ఆధారపడివుంది.

ఏ దేశంవాడైనా రంగుని పట్టి మనిషిని వర్గీకరించడం రాతి యుగపు భావన. ఏ దేశానికైనా అంతరింగిక విధానాన్ని రూపు దిద్దుకొనే హక్కు వున్నమాట నిజమే. కాని దాని పేరిట మారణహోమం జరుగుతూంటే ప్రపంచం ఘోషిస్తుంది. దక్షిణాఫ్రికాలో అనుసరింపబడుతూన్న విధానం ఐక్య రాజ్య సమితి దేశాలన్నిటికీ సవాల్. దీన్ని చిత్తశుద్ధితో ఎదుర్కోవలసిన బాధ్యత అందరిపైనా ఉన్నది.

చిరు హృదయాలలో జాతి విద్వేష బీజాలను నాటడం నిజంగా ముదావహం. అంటరానితనం అన్నది ఎంత హృదయంలేని ఆచారమో తెలుసుకోవాలి. భారత దేశంలో అంటరానితనం ఒక విధంగా నివారించింది, అయినా మనదేశంలో అంటరానితనం అన్నది విపరీత పరిణామాల కెన్నడూ దారితీయలేదు. గాంధీ మహాత్ముని ధర్మమా అంటూ అంటరానితనం అస్పృశ్యత అన్నవాటికి మనదేశంలో విలువపోయింది, ఆఫ్రికాలో కూడా ఓ గాంధీజీ అవతరించాలా యీపనికి అనిపిస్తుంది. పిల్లల చదువు సంధ్యలకి అడ్డునిలచి, పెద్దల కోట్లాటలకి దారితీస్తున్న యీ దౌర్జన్యపూరిత చర్యలకు స్వస్తి పల్కించే రోజు రావాలని నాగరిక ప్రజలందరి కోరిక.

—రుద్రాణి.

స్పందించిన కవి హృదయపు రూపకల్పన :

ఎఱ్ఱ రోజా మొగ్గ

శ్రీ ఆరుద్ర

ఎఱ్ఱరోజామొగ్గ - ఎఱ్ఱరోజామొగ్గ
తారుణ్యశ్రీదేవి దరహసించిన బుగ్గ
స్వాతంత్ర్యయోధునికి సాభిమానమ్ముగా
ప్రతిరోజు ఉదయమ్ము హృదయపుకానుక

ఉడుకునెత్తురు పొంగిపొరలే
యువక హృదయపు దేశభక్తుడు
ఒక్కనిముషము సైతమాతడు
మొక్కవోనీడు

అతని వదనములోన తోచును
అసంఖ్యాకుల ఆశలన్నియు
అతడి సదనము దేశమాతకు
ఆలయమ్మగును

భారతావని పారతంత్ర్యము
పారద్రోలగ దీక్షబూనిన
వీరనేతను దేశమంతయు
వేనోళ్ళ పొగిడింది

అతని చైదము లద్భుతమ్ములు
అతని రూపము అతని నామము
గుండెలందున పెట్టుకొందురు
కోటానుకోట్లు

అతడు తీసిన బాటలోనే
అడుగువేయుచు సాగుచున్నా
అజ్ఞాతముగ ఆతనికెంద.
రభిమానులున్నారో !

ప్రతి దినమ్మున బయటకొచ్చి
ప్రాంగణమ్మున అతడు నిలువగ

ఎఱ్ఱరోజా మొగ్గ నిచ్చును
ఏహస్తమోగాని !

వ్యాపకేతర పరాన్ముఖుడా
ప్యాయచిహ్నమ్మనుచు తెలియక
స్వీకరించేవాడు ఎఱ్ఱని
చిరుత రోజాను

వరుస తప్పక రోజూరోజూ
చిరుతరోజా చేతికందగ
కోటుకాజాలోన గుచ్చగ
కోరి విచ్చేది

పరప్రభుత్వము విరగడైతే
అరుణ స్వేచ్ఛాగంధ మిట్లని
సువాసనలు నలుమూలందున
సుమము జల్లేది

ఎడద నెత్తుటిరంగు చిహ్నము
ఎఱ్ఱరోజా మొగ్గయను, యు
ద్దేశముననిది దాల్చినాడని
దేశమనుకొంది

వత్సరమ్ములు కొన్ని గడచెను
వరుసతప్పెను యొక్కదినమున
చాపినట్టి కరమ్ము చేరగ
లేపూవు రాలేదు

ఇంటిబయటకు వచ్చినంతనె
ఎర్రరోజా స్వీకరించుట
అలవాటు కావున ఆగినా
డప్రత్నముగ

క్షణము లెన్నో గడచినా ఈ
దినము రోజా నీయరెవరూ
పలకోయని ఎడదలోపల
ఎంచినాడతడు

తోటమాలిని పిలిచి యడిగెను
"ద్దోర రోజా యేదిరా?" యని
"నిత్యమొచ్చే నెలతదానిని
నేడు తేలేదు"

అనుచు చెప్పెను తోట మాలీ;
వినిన పలుకులు విస్మయమ్మును
నేత మదిలో నింపెనంతట
ఆతడిట్లనియె

"నీ వనే యీమాటలేమిటి?
నెలతయెవ్వరు ఇచ్చుటేమిటి?"
మీ దేశసేవను పొలతి యొక్కతె
మెచ్చుకొన్నాది

ఆమె హార్దిక వందనమ్ముల
నజ్ఞాతముగ అందివ్వమనుచు
పంపుచుండె గులాబిరూపున
ప్రత్యూష సమయమున"

"యిన్ని దినములు నన్ను మెచ్చి
యిచ్చిచుండెన? ఎడద దీవన
ఎవ్వరాయమ? యెచట నుండును?
యిపుడె చూడాలి."

అనుచు నాయకు డడిగె నంతట
కనులు తుడుచుకు మాలి చెప్పెను
"నిన్న నే ఆనెలత పాపం
కన్ను మూసింది"

నివ్వెరమ్మున నీటికంటిని
నేతకూడా తుడుచుకొనియెను
తోటలోగల యెర్రరోజా
కోటుకాజాలోన దాల్చెను

ఆమెయెవరో, నామమేదో
ఏమివూరో, ఎంతవయసో
బాసయేదో, వేసమేదో
బ్రహ్మకైనా నేడు తెలియదు

అయిననూ మననేత మాత్రం
అనవరతము గులాబి దాల్చును
అజ్ఞాతసుందరి హార్దికాంజలి
అమరస్మృతి కొరకై —

★

దారివెంట పోతూన్న ఒక సింహానికి కప్ప బెక బెకలాడ్డం వినిపించింది. చప్పుడుచూసి చాలా పెద్ద జంతువేదో దాగివుండి వుండాలని పొంచి నిలచింది ఆ సింహం. కొంత సేపటికి ఓ చిరు కప్ప గెంతుకుంటూ గుంటలోంచి పైకి వచ్చింది. సింహం ఒక్క ఉదుటున ఆ కప్పపిల్లని తన పాదం కింద అణచిపెట్టి ఆశ్చర్యపడుతూ అంది. "వింతగావుంది. నువ్వు చూడపోతే యింత చిన్న జంతువ్వి. నీకు ఎంతపెద్ద కంఠంవుందీ!" అని. కొందరు మనుష్యులుకూడ యింతే. పిట్టకొంచెం- కూత ఘనం!

శ్రద్ధాంజలి !

శ్రీ ఉన్నవ

దేశభక్తుడూ, సంఘ సంస్కర్తా, సాహితీవేత్తా అయిన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు నిర్యాణం చెందారంటే, అయ్యో, బహుళోద్యమకర్తలు ఉత్సాహులు అంతా ఆంధ్రగడ్డపైనుంచి వైదొలగుతున్నారా అన్పిస్తుంది. శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మగారు పన్నెండు సంవత్సరాల క్రితమే కనుమూశారు. భార్యా భర్తలిద్దరూ సంఘసేవలో, రాజకీయాలలో జంటగా కలసిమెలసి తిరిగి, తాము పనిచేసే ఉద్యమానికే దోహదకారులుగా వుండేవారు.

1887 డిసెంబరు మాసం 4-వ తేదీన గుంటూరు జిల్లాలోని "ఉన్నవ" పల్లెలో జన్మించారు లక్ష్మీనారాయణగారు. ఉన్నత విద్యకై విదేశాలకువెళ్లి, బారిస్టరుగా ఎంతో పేరు సంపాదించారు. 1921 లో ఉచ్ఛస్థితిలోనున్న ప్రాక్టీసుకు స్వస్తిచెప్పి, స్వామి సీతరామ్, మాడభూషి నరసింహాచార్యప్రభృతులతోపాటు 1921, 30, 42 సంవత్సరాలలో కారాగారవాసంలో వున్నారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి, దేశభక్త కొండా వెంకటప్పయ్యగారికీ, అతి సన్నిహితులై రాజకీయ రంగంలో కదనుతొక్కిన ఉన్నవ, కందుకూరివారి సాంగత్యంతో సాంఘిక రంగంలోకూడా అమిత ఉత్సాహాన్ని ప్రదర్శించారు. వారి ఉత్సాహ ఫలితమే "శారదా నికేతన్" అనబడే వితంతు శరణాలయం శారదానికేతన్ స్థాపనతో ఊరుకోక ఎన్నో వితంతు వివాహాలు స్వయంగా జరిపించారు.

సాహితీ సేవలోకూడ వారిది పెద్దచెయ్యే. వారి సాంఘిక నవల "మాలపల్లి" అశేష ప్రజాదరణ నందుకొన్నది. హరిజనుల పరిస్థితులను కన్నులకు కట్టినట్టు చూపే వారియీ నవల యిటు వెండితెరకెక్క నున్నదని వినడం సంతోషదాయకమే. ఇదే నవలను ఢిల్లీ సాహిత్య అకాడమీవారు హిందీ మొదలగు యితర ప్రాంతీయ భాషలలోకి అనువదింప నుద్యమించినారు. ఇదియూ సంతోష దాయకమే. మాలపల్లివంటి ఉత్తమశ్రేణికి చెందిన నవలలు యిప్పటికీ మనకి అరుదే. తెలుగుజాతి సర్వతోముఖ జీవితాన్ని ప్రతిబింబించిన ఏకైక నవల అది. పీడిత జనోద్ధరణ తొలినుండి తుదివరకు సూచించే యీ నవల బ్రిటిషువారి ఆగ్రహానికి గురిఅయి నిషేధింపబడ్డం సహజమే. ఇప్పుడదే ఉద్గ్రంథాన్ని మన ప్రభుత్వాలు, ప్రభుత్వ సాహిత్యశాఖలు గుర్తించి పునరుద్ధరించడంకూడా సహజమే.

కాని, వ్యక్తి మనమధ్య నున్నన్నాళ్లూ గుర్తించక పోయిన వెనువెంటనే సంతాప సభలకు కొదువ లేకుండా, పొగడ్తకి హద్దులేకుండా ప్రవర్తించడం నిజంగా శోచనీయమైన పరిస్థితి. దేశభక్తులూ దేశారాధకులూ, ఉత్తమ కళాకారులూ ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులకే యెరకావడం మనం హర్షింపతగ్గదికాదు.

పంతులుగారి చివరిరోజులు కష్టాలలో గడిచాయని చెప్పుకుంటూరు. ఎంతటి సంఘసేవకుడూ స్వార్థత్యాగి అయిన దైనందినావసరాలు ఉంటాయి కదా? దేశారాధకులకు వాటినైనా సమకూర్చని మొసలి కన్నీళ్ళ ప్రయోజనం శూన్యం. పంతులుగారి కుటుంబానికి సానుభూతితోపాటు యితోధిక ఆర్థిక సహాయంకూడ చేయ నడుం కట్టవలసిన బాధ్యత ఆంధ్ర ప్రజానీకంపై వుంది. అది విస్మరింపరాని బాధ్యత.

పండుటాకే అయినా భర్తికి విలులేని మూర్తి ఉన్నవ వారిది. వారి ఆత్మకు శాంతి ప్రసాదించాలనీ, వారి పేరు చిరస్మరణీయం కావాలనీ, వారికి సర్వదా కృతజ్ఞులైన మహిళల కోరిక.

—కె. రా.

ఒక తేనెటీగ పాము పడగమీద కూర్చుని, ఉండీ, వుండి కుడుతూ ఆనందిస్తోంది. ఈ చిత్రవధని సహించలేక, తానేంచేస్తున్నదీ ఆలోచించకుండానే బండిచక్రంక్రింద తల పెట్టేసిందిపాము. తేనెటీగా పామూ కూడా చచ్చిపోయాయి. ఈ పాములాగే కొందరు వ్యక్తులుంటారు. తాము చచ్చిపోవడానికేనా ఒప్పుకుంటారుగాని శత్రువులనిమాత్రం బ్రతకివుండనివ్వరు.

మేరీ స్టోప్సు సతి

ప్రముఖ కుటుంబ నియంత్రణ ప్రచారకురాలైన డాక్టర్ మేరీ స్టోప్సు మరణించడంతో యీ ఉద్యమం ఒక మూల స్తంభాన్ని కోల్పోయినట్టే, ఆధునిక గర్భ నిరోధక విధానాలకు నాంది వేసిన ప్రముఖురాలు. ఈ విషయాలపై అనేక గ్రంథాలను రచించింది. 1921 లోనే ప్రపంచంలోకే మొదటిదైన బర్త్ కంట్రోల్ క్లినిక్కును స్థాపించింది.

లైంగిక విజ్ఞాన విషయాలపట్ల దాపరికం అనవసరం, అపాయకరం కూడా అనీ, ఆ విషయాలపై శాస్త్రయుక్తమైన బోధన యువతీ యువకులకు ఎంతైనా అవసరం అని పోరాడింది. ఈమె రచించిన తొలి గ్రంథాలు "అసభ్యం" అంటూ ప్రభుత్వం నిషేధించింది కూడా. కాని అవే గ్రంథాలు ఆమెకు ప్రపంచ ఖ్యాతిని తెచ్చిపెట్టాయి, 1918లో "వైవాహిక ప్రేమ" అన్న యీమె పుస్తకం వెలువడింది. 1950 నాటికి యీ గ్రంథం మిలియను ప్రతులు అమ్ముడు పోయాయట.

ఈ రోజులలో బర్త్ కంట్రోలు విషయాలు అత్యవసరాచరణీయమని జనాభాతో బాధ పడుతున్న మన దేశం వంటి దేశాలు గుర్తించాయి. దీన్ని పట్టి చూస్తే స్టోప్సు సతి ఉత్సాహం, శ్రమా వృధా కాలేదు, నాగరికులందరు కూడా బర్త్ కంట్రోల్ అన్న పదాన్ని 'అసభ్యం' అనడంలేదు; మన దేశంలో యీ విషయాన్ని జనబాహుళ్యానికి తెలియ చెప్పడానికి ప్రభుత్వం వేస్తూన్న ప్రణాళికలూ, తీసు కుంటూన్న శ్రమా చాలు నిదర్శనకు. ★

కథానిక:

స్వేచ్ఛకోసం

శ్రీ ఎ. ఎస్. రామారావు.

నా చిన్నతనంలోనే మా అమ్మ చనిపోయింది. మా అమ్మ వంట్లో చికాగ్గా వున్నప్పుడే అమ్మకు ఉపచారాలు చెయ్యటానికని మా అత్త వచ్చింది. కాని భగవంతుడికి మామీద దయకలగలేదు. అమ్మ చనిపోయింది. నన్ను చూసే దిక్కెవ్వరూలేరని మా అత్త మా యింటనే వుండిపోయింది. తల్లిలేని కొరత కనిపించకుండా నన్నెంతో గారాబంగా చూసేది. మా నాన్నవన్నీ ప్రాచీన సాంప్రదాయాలూ, పూర్వాచారాలూను. అంచేత ఎందరెన్ని చెప్పినా, సవతితల్లి పోషణలో, నాకేం ముప్పువాటిల్లుతుందోనని రెండో పెళ్లి చేసుకోటానికి మనస్కరించలేదు.

ఇలా రెండేళ్ళు గడిచేయి. నాకు పెళ్ళి చెయ్యాలని, ముఖ్యంగా తన అజమాయిషీలో నా పెళ్ళి జరగాలని మా అత్త ఎంతో ఉబలాట పడుతూండేది. నాన్నతో ఎన్నిసార్లు చెప్పినా, ఆయన ఆ మాటలన్నిటినీ పెడచెవిని పెట్టేవాడు. అయినా, అత్త మనస్సులో ఈ ఒక్క కోరిక పీక్కుతింటూనట్టు నాకు కనిపించేది.

ఆ కాలంలో పన్నెండేళ్ళ లోపుగా స్త్రీకి వివాహం జరక్కపోతే లోకం నిందించేది. అప్పటి శాసనాలూ, వాటిని సమర్థించే మనుషుల్ని చూసే నాకు ఒళ్ళు మండి పోయేది. కాని నేనేం చెయ్యగలను? ఆ శాసనాల్ని ధిక్కరించే వాళ్ళెవ్వరూ లేరా కాలంలో, పొరపాటున నేలాంటి వాళ్లెవరైనా వుంటే, వాళ్ళని సంఘం పేరు చెబుతూ ఈ పెద్దలంతా బహిష్కరించే వారు. ఈ సాకుతో మా అత్త నాకు త్వరగా పెళ్ళి చెయ్యమనీ, ఇప్పటికే. లోకం ఎంతో నిందిస్తోందనీ, నాన్నతో చెప్పడం మొదలెట్టింది, పైగా నాన్న నాకు వివాహం చెయ్యటానికి నిశ్చయించు కున్నాడు.

నాకు పెళ్ళయిన మరుచటి సంవత్సరమే అత్త వారింటికి వెళ్లేను. వెళ్లటానికి ముందు మా అత్త నా గురించి పొందిన శ్రమ, విచారం ఇంతని చెప్పలేను. పాపం, నన్ను ఒంటిగా విడవటానికి ఆమెకు మనస్సు రాలేదు. కాని, ఆడదై పుట్టిన తరువాత తప్పుతుందా? అయినా సరే, విధి నాకెదురు తిరిగింది. అత్తవారింటి కెళ్లిన ఆరు నెలల్లోనే నా ఐదోతనాన్ని తీసుకుని నా భర్త చక్కాపోయేడు. ఒకప్రక్క ఎండి మోడైన జీవితాన్ని, శూన్యంగా మిగిలిన జీవితాన్ని తల్చుకుని నేను నాలో కుమిలిపోతుంటే, లోకం పేరుతో వ్యవహరిస్తున్న కాకుల మూకల సూటి పోటి మాటలు నా హృదయాన్ని మరింతగా గాయపరిచేయి. మెట్టినింట్లో వుండడం దుర్భరంగా మారింది. "నా" అన్న వస్తువు పోయిన తరువాత నన్నక్కడెవరు చూస్తారు? అంచేత తిరిగి పుట్టింటికే వచ్చాను.

ఆ కాలంలో భర్త చనిపోతే భార్యకు తల తీయించే అలవాటు వుంది. అసలీ అలవాటుని ఎవరు సృష్టించేరో నాకు తెలియదు కాని, ఈ శాసనాల్ని అతురాలా ఆచరణలో పెడుతున్న అనేక మందిని స్వయంగా చూసేను. అంచేత నాకూ తల తీయిస్తారేమోనని భయమేసింది. తల తీయించ కుండా వుండటానికి లెక్కలేనన్ని. దేవుళ్లను ప్రార్థించే దాన్ని. బారెడు పొడుగున వ్రేళ్ళాడే నా నల్లని శిరోజాల్ని చూసి మురిసిపోయేది మా అత్త. మా అత్త మొగుడు కూడా ఆమె తొమ్మిదోఏట చనిపోయేడట. అత్తకు చిన్నప్పుడే నిర్బంధంమీద తల తీయించారు. ఆమె ఎలాగో ఇంత వరకూకాలం గడుపుకుంటూ వచ్చింది. తనకు మల్లె నాకుకూడా తలతీయిస్తారేమోనని ఆమెకు భయం. అంచేత, మా నాన్న నా తల ఎన్నిసార్లు తీయించేస్తానన్నా, ఆడదానిగా అన్ని కష్టాలనూ అనుభవించిన మా అత్త ఒప్పుకునేది కాదు. ఎలా అయితే నేం అత్త మాటలకు కట్టుబడిపోయేడు మా నాన్న.

రోజులు గడుస్తున్నాయి. మా అత్తకు నన్ను చదివించాలని బుద్ధి పుట్టింది. నిజం చెప్పాల్సి వస్తే నాకూ చదువుకోవాలనే వుండేది. కాని, మా నాన్న ఈ

పరిస్థితుల్లో ఏమంటాడోనని భయం. ఆ మాట ఒక నాడు అత్త మా నాన్న చెవిని పడేసింది. దాంతో మా నాన్న "కులాచారాన్ని ధిక్కరించి ఇదివరకు చెప్పిందానికి వూరుకున్నాను. స్కూల్లో కూడా ప్రవేశపెట్టమంటావా" అంటూ అత్తమీదకు కస్సున లేచాడు. అంతేకాక "స్కూల్లో ఆడపిల్లలు చదువుతే పాడయిపోతారు; ఆడవాళ్ళు అసలు చదువుకో కూడదు" అన్నారు కోపంగా. అన్నీ చచ్చుసిద్ధాంతాలే నాన్నవి. పైగా పట్టుదల కూడాను.

"అమ్మాయి భవిష్యత్తు ఇక దానిమీదే ఆధారపడి వుంది. మనకూ వయస్సుమళ్ళింది. అందుచేత పిల్ల దాని క్షేమం కోరయినా మనం కొంత వరకూ మూఢ నమ్మకాల్ని ఎదుర్కోవల్సి వుంటుంది" అంది అత్త నాపైన అభిమానాన్ని కనపరుస్తూ. ఆమె మాటలు నాలో నూతనోత్తేజాన్ని కలిగించాయి.

నాచేత చాలా షరతులకుఒప్పించి నన్నుస్కూల్లో చేర్పించాడు మానాన్న. ఆ షరతులకు నేను అంగీక రించాను.

స్కూల్లో లీల ఒక్కర్తే నాకు ప్రియ స్నేహితు రాలు. ఆమెను చూడకుండా ఒక్కరోజైనా వుండ లేక పోయేదాన్ని. రోజూ విశ్రాంతి సమయంలో స్కూలుకు వాళ్ళ ఇల్లు దగ్గరగా వుండటం చేత వాళ్ళింటికి వెళ్ళి సరదాగా కాలం గడిపేదాన్ని.

లీల ఇంట్లో వాళ్ళ అమ్మా, అన్నయ్యా డాక్టరు రాంబాబు వుండేవారు. లీల తల్లి మొదటిభర్త చని పోతే, తిరిగి వివాహం చేసుకుంది. అప్పుడే లీల, రాంబాబు పుట్టేరు. తరువాత కొంతకాలానికి రెండో భర్తకూడాచనిపోయేడు. సంఘాచారాలకు భిన్నంగా వ్యవహరించి నందుకు అంతా వాళ్ళను అదోలా చూసేవారు. అందరితోపాటుగా మానాన్నకూడాను. లీల వాళ్ళింటికి వెళ్తానని మా నాన్నకు తెలియదు, లేకపోతే ఆనాడే నన్నేం చేసి వుండేవారో !

ఒక రోజున లీల స్కూలుకు రాలేదు. నాకు కారణం యేమీ తెలియదు. మనసు లీలను చూడటానికి ఆతృత పడసాగింది. ఎలాగో విశ్రాంతి సమయం వరకు ఓర్చాను. తరువాత తిన్నగా లీల ఇంటికి వెళ్ళేను. ఇంట్లో రాంబాబు తప్ప ఇంకెవ్వరూ లేరు. ఆనాటివరకూ రాంబాబుని చూడటం కాని, మాట్లాడ్డంకాని తటస్థించలేదు. ఎందుచేతనంటే, మా నాన్నకు ద్రోహం చేసిన దాన్నవుతానేమోనని. కాని ఆరోజున "లీల ఇంట్లో లేదా?" అని అడగక తప్పింది కాదు. అంతే. "ఎక్కడికో వెళ్ళింది. వచ్చేవేళయింది కూర్చో" మంటూ కుర్చీని చూపించేడు. అలసటగా వుండటంచేత వెంటనే తిరిగి రాలేక తల వంచుకుని కుర్చీలో కూర్చున్నాను.

చలివెయ్యటం, ఒళ్ళు ఒణకడం ఆరంభించింది. ఏదో చెప్పలేని భయం వేసింది. ఇక తప్పదు కనుక "రాంబాబూ" అన్నాను ఒణుకుతున్న గొంతుకతో. ఏదో పుస్తకాన్ని దీక్షగా చదువుకుంటూన్న అతను ఒక్కసారిగా నన్నూ, నా పరిస్థితిని చూసి తొందరగా నావద్దకు వచ్చేడు, నన్ను నెమ్మదిగా లేవనెత్తి, మెల్లగా మంచంపైన పరుండ బెట్టేడు. మెడ వరకూ దుప్పటి కప్పేడు. ఇంతలో లీలగొంతు వినిపించింది. "లీలా" అని పిల్చాను గట్టిగా. పరుగున వచ్చి లీల నాదగ్గర కూర్చుంది, రాంబాబు ఏదో మందు కలిపి తాగమంటూ నవ్వుతూ నాచేతి కందించేడు. అతని ముఖాన్ని, ఆ చిరునవ్వునూ చూస్తుంటే నాలో ఏదో భయమూ, సిగ్గూ పుట్టు కొచ్చేయి. మందు తీసుకున్న కొంచెం తేరుకున్నట్లనిపించింది. లీలనువచ్చి మా ఇం టికి దిగబెట్ట మన్నాను. లీల, రాంబాబు ఇద్దరూకలిసి నన్ను మా ఇంటికి తీసుకు వచ్చేరు.

ఆ రోజల్లా మా నాన్న నన్నదోలా చూసేడు. మానాన్న కేదో తీరని ద్రోహం చేస్తున్నట్లనిపించింది నాకు. అంచేత ఆ మరుచటి దినమేలీలతో "ఈ రోజు నుంచీ నన్ను పూర్తిగా మర్చిపో" అని ఖచ్చితంగా చెప్పేసేను. "నేను మరవలేక పోయినా, మా అన్న నిన్ను తప్పక మరుస్తాడులే" అంది లీల సరసంగా. అప్పుడదోలా అనిపించిందినాకు.

"ఏమీ తోచక మంచంమీద పడుక్కున్నాను ఆ సాయంత్రం. మా నాన్న తొందర తొందరగా వచ్చి "నా గౌరవం పాడుచేశావు. నాకు అవమానం తెచ్చావు. వద్దంటూన్న స్కూల్లో ప్రవేశ పెట్టించేవు, ఏంచూసుకుని తలెత్తుకు వీధిలో తిరిగేది?" అంటూ అత్తను నానా చివాట్లుపెట్టి నా దగ్గరకు వచ్చేడు. ఆ మండుతున్న శరీరం, నిప్పులు కక్కుతున్న కళ్ళనీ చూస్తే భయం వేసింది. మా అత్త అడ్డురాక పోతే ఆ రోజు నన్ను చంపేసేవాడే.

"రాంబాబు ఒక్కడూ వున్నప్పుడు వాళ్ళింటికి ఎందుకెళ్ళావ్? వాడితో ఎందుకుమాట్లాడేవ్? ఎవరూ

లేనప్పుడూ వెంటనే తిరిగి రాలేకపోయావా? అసలు వాళ్ళింటి కెళ్ళాల్సిన అవసరం ఏమొచ్చింది? వాళ్ళింటికి వెళ్ళొద్దని చెప్పానా. లేదా," అంటూ ప్రశ్నల వర్షం కురిపించి నా సమాధానం విన కుండానే ఇంట్లోంచి వెళ్ళిపోయేడు. సమాధానం ఇవ్వటానికి నానోరు కదిల్తేగా !

"లీల ఇంట్లో జరిగిందెవరికి తెల్సు? ఎవరైనా నా మీద కిట్టనివాళ్ళు అనరాని మాటలు నాన్నతో చెప్పి వుండాలి. లేకపోతే వాళ్ళింటి కెళ్ళినట్లు నాన్న కెలా తెలుస్తుంది. అందులోను నాన్నకు నేనంటే తగని అభిమానం. నాన్నకు ద్రోహం చెయ్యటానికి తలపెడతానా?" అంటూ పొంగిపొరలు కొస్తున్న దుఃఖంతో అత్తతో చెప్పేను. అత్త నన్ను ఓదార్చి "నాన్నకు నచ్చజెప్తాలే" అని భరోసా ఇచ్చింది. అత్తకి నా మీద గల అభిమానాన్ని, ప్రేమను తల్చుకుంటే నామనస్సు ఉప్పొంగుతుంది. మనసులోనే అత్తకు ధన్యవాదాలర్పించు కున్నాను.

రాత్రి పదిగంటలైంది. నాన్న భోజనం చేసివచ్చి గదిలో కూర్చున్నాడు. అత్త చెప్పినట్టుగానే గదికివతల తట్టున పొంచి నిల్చున్నాను. నాన్నకు కనిపించకుండా కిటికీలోంచి వింటున్నాను. అత్త నా గురించి ఎన్నో విధాలుగా నాన్నకు నచ్చచెప్పడానికి ప్రయత్నించింది. కాని, నాన్న అత్త మాటలు లెక్కచెయ్యకుండా "ఇప్పటికే చెడిపోయింది. దానికి తప్పకుండా తల తీయించాల్సిందే, అప్పుడు దాని ముఖం చూడటానికెవరూ ఇష్టపడరు. అది ఆచారంకూడా", అంటూ "రేపే ఆపనికాస్తా అయిందనిపించేస్తాను." అన్నాడు ఇంకా ఏవేవో మాటలు అన్నాడు. అ మాటలు వింటూంటే నాకో ఆందోళనతో కూడిన భయంవేసింది. ఇంతలో కిటికీప్రక్కగానుండి వింటున్న నన్ను నాన్న చూసేడు "మాటలన్నీ అమ్మాయి గోడచాటునుంచి వింటున్నదే" అన్నాడు అత్తతో కోపంగా. ఆమాటలే ఆఖరిసారిగా నాన్ననోటి నుంచి వినడం. అంతే. ఆ మాటలు వినగానే ఇల్లు వదలి వచ్చేశాను.

ఆ అర్ధరాత్రి కటిక చీకటిలో తిన్నగా లీల ఇంటికి వచ్చేశాను. ఆ ఇంట్లోవాళ్ళంతా నన్నెంతో ఆప్యాయంగా ఆదుకున్నారు. వారింట్లో నాకు సముచిత స్థానం లభించిందనే చెప్పాలి. అలా జరుగుతుందని నేను కలలోనైనా వూహించలేదు. అంతవరకూ జరిగిన కథంతా పూసగ్రుచ్చినట్లు లీల, వాళ్ళకి వివరించి చెప్పేను. ఆరాత్రే అంతాకలసి ఆవూరు విడిచి పట్నం చేరుకున్నాం.

పట్నం వచ్చినా నామనస్సు అత్తని గురించే కలత చెందేది. ఆమె నాపైచూపిన ప్రేమకు, నేనామెనెలా మరువగలను? రాంబాబు నాతో ప్రవర్తిస్తున్న తీరుచూస్తుంటే అతను నన్ను ప్రేమిస్తున్నాడని అర్థం చేసుకున్నాను, ఆనాడు తొలిసారిగా అతన్ని చూసినప్పుడే. అతనంటే నాకదోలాంటి భావం ఏర్పడింది. కాని, నాన్నకు ద్రోహం చేస్తున్నానేమోనని ఆ ఆశను ఎప్పుడో వదలుకున్నాను.

ఒకరోజు ఉదయాన అప్పుడే ముఖం కడుక్కుని ఏమితోచక ఆకాశంకేసి చూస్తూ వరండాలో వున్న కుర్చీలో కూర్చున్నాను. రెండు చేతులలో రెండు

కప్పుల కాఫీని తీసుకొచ్చి, చిన్నగా నవ్వుతూ ఒకటి నాకందిచ్చేడు రాంబాబు. ఏదో ఆశతో చూస్తున్న అతని కళ్ళనూ, చిరునవ్వుల వెనకాల ఏదో రహస్యాన్ని దాచటానికి ప్రయత్నిస్తున్న అతనిముఖాన్ని చూస్తున్న నాకు నవ్వొచ్చింది. ఎంత ఆపుకోడానికి ప్రయత్నించినానాకుసంభవంకాలేదు. ప్రత్యుత్తరంగా నేను ముసి ముసిగా నవ్వేను. రాంబాబు ఏమనుకున్నాడో ఏమో! వెంటనే తిరిగి వెళ్ళిపోయేడు. ఆతని తొందర పాటునుచూస్తుంటే అతనేదో అవ్యక్తానందానుభూతిని పొందుతున్నట్లనిపించింది.

రాంబాబు తిరిగి వచ్చినప్పుడు ఒక దినపత్రికను కూడా తీసుకు వచ్చాడు. తిన్నగా నాదగ్గరకు వచ్చి అందులోని ఒక వార్తను నాకు చూపించాడు. పత్రికలో ఇలా వుంది. —"గ్రామంలో శంకరశాస్త్రి అతని చెల్లెలు గంగమ్మా ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. ఇల్లు సోదా చెయ్యగా శంకరశాస్త్రి తన కూతురుపేర వ్రాసిన వుత్తరం దొరికింది. ఆ వుత్తరంలో "అమ్మాయీ! నీకునచ్చిన వాణ్ణి పెళ్ళి చేసుకుని హాయిగా, జీవించు" అని ఒక్కవాక్యమే వ్రాసి వుంది!" ఆవార్త చదివేసరికి నాలో ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికింది. వెక్కి వెక్కి ఎంతసేపు ఏడ్చానో నాకే తెలియదు.

నామీద అవాజ్యమైన ప్రేమ, అభిమానం చూపించి నాకోసం అష్టకష్టాలను అనుభవించి చివరకు ఆత్మత్యాగానికి కూడా సిద్ధపడ్డ మా అత్తను స్మరించలేకుండా ఒక్కనిమషం వుండలేకపోతున్నాను. మూఢనమ్మకాలతో స్వార్ధపరులు, స్వసుఖంకోసం సృష్టించుకున్న ఆచారాల్ని అంతవరకూ శాసనాల్లా మూర్ఖంగా నమ్మి, ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించి విఫలుడై, పశ్చాత్తాపంతో; చివరకు నామీద సానుభూతిని చూపించి ఆశీర్వదించిన మా నాన్నకు జోహారులర్పించు కున్నాను. నాకోసం, నాసౌఖ్యం కోసం సంఘాచారాల్ని కాదన్న తనను లోకం నిందిస్తుందన్నభయంతో ఆత్మహత్య చేసుకున్న నాన్నగాని, అతిగారాబంగా పెంచి పెద్ద చేసినఅత్త గాని కలలోనైనా కంటబడతారేమోనని ఆశించాను. నా ఆశలన్నీ నిరాశలయ్యాయి. నామీదే తన ఆశలన్నీ పెంచుకున్న నాన్నకు ద్రోహం చేశానేమోనని కాబోలు నాన్న కనిపించలేదు. నాకు తన ముఖం చూపించడానికి అత్తకు సిగ్గేసింది కాబోలు. వారి ఆత్మలకు శాంతి కలిగించలేక పోతున్నానేమోనని పిస్తూండేది.

మాలో ఎవరు తప్పుచేసినట్లు? ఒకరికొకరు పరమ శత్రువులమైనట్టుఒకరినిఒకరు పలుకరించరేం? అయినా సరే, మామధ్య నిల్చింది ప్రేమ. దీన్ని జయించటం కోసంఎటువంటి పరిస్థితుల్నెదుర్కో వల్సివచ్చింది! ★



పురుష లక్షణాలు

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్.

ఏదో బళ్ళో చదువుకునే రోజుల్లో పురుష లక్షణాలివని, పురుషార్థాలివి కంఠతా నేర్చుకున్నట్లు జ్ఞాపకము. నవరసాలేవో, పంచతంత్రాలేవో, అష్టకష్టాలేవో, సప్తసముద్రాలేవో జ్ఞాపకము లేనట్లే ఈ పురుష లక్షణాలేవో కూడా జ్ఞాపకము లేదు. కాని ఒక్కటి మాత్రము జ్ఞాపకము: వుద్యోగము పురుషలక్షణమని. అది జ్ఞాపకముండటానికి కారణము లేకపోలేదు. మా చుట్టాలమ్మాయి చాలా రోజులు పెండ్లి చేసుకోకుండా వున్నది. ప్రతి సంబంధము వద్దనేదని వింతగా ముసలమ్మలు ముక్కుమీద వ్రేలు వేసుకొని చెప్పుకుంటుంటే చాలాసార్లు విన్నాను. పెళ్ళికొడుకుకు వుద్యోగము లేకపోతే చేసుకోను, వుద్యోగము పురుష లక్షణము అనేదట. నాకప్పుడు ఆ అమ్మాయి లౌకిక జ్ఞానము అర్థముగాక వింతగా వినేదాన్ని ఆకబుర్లు. పెండ్లి కొడుకు వుద్యోగము లేకుండానే పెండ్లికి తయారైతే, పెండ్లికూతురన్నా వద్దనకపోతే ఎట్లా?

కాని చిన్నప్పుడు మాస్టరుగారు చెప్పిన లిస్టుకు, తరువాత పెద్దలు నాకు చెప్పిన లిస్టుకు, ఆతరువాత నేను గ్రహించిన విషయాలనుబట్టి తయారు చేసిన లిస్టుకు చాలా తేడా వున్నది. అసలు ఒకదాని కొకదానికి పోలికే లేదనుకోవచ్చు. చాలారోజులు ఈ లిస్టుతో తికమకలు పడి ఇదమిత్థము తేల్చుకుందామని ఈ చిక్కు సమస్యలో తగుల్కొని బయట పడేటప్పటికి తల ప్రాణము తోకకొచ్చింది. ఇంకా నయము కన్ను లొట్ట పోయేదే. ఏదో అదృష్ట వశాత్తు లొట్ట పోకుండానే బయట పడ్డాను.

ఇంతకీ నేను గ్రహించిన పరమ సత్యాలేమిటంటే-ఈ భువిలో పురుష లక్షణాలు, స్త్రీ లక్షణాలు అంటూ పుట్టి పోషింపబడుచున్నట్లు కనబడుచున్నది. కాని అవి రెండవ ప్రపంచ సంగ్రామము కాలమునుండి భారతావనిలో ప్రచండ రూపము దాల్చినవి. వాటికి కాంగ్రెసు సంస్థ ద్వారా శ్రీ గాంధీ మహాత్ములవంటి వారు సైతము ఏదో విధంగా దోహదమిస్తున్నట్లు కనబడుచున్నది. ఇప్పుడు ఆ ప్రచండ స్వరూపాలు శాంతిస్వరూపాలు దాల్చినా అసలు వాటి నిజస్వరూపాలు చాలా మార్పు బొందినవి. ఇప్పుడు మూర్తి బొందిన ఆస్వరూపాలు దశావతారాలలో వివిధ భంగుల ప్రత్యక్షమై మానవ జాతికి ఇహ పరములొసగు చున్నవట!

ప్రేమమయుడగు సృష్టికర్త ఈ ప్రపంచాన్ని సృష్టించేటప్పుడు పురుషులు, స్త్రీలని రెండు రకముల మానవులను సృష్టించి అందు పురుషులకు ఎక్కువ సదుపాయాలు కలిగించినాడు. ఏల బ్రహ్మకు కూడ ఇట్టి పక్షపాతమో మనకు తెలియదు. బహుశా వారు స్త్రీలనుండి రక్షించుకొనుటకు ఏర్పరచిన ఆయుధాలేమో! అయితే అప్పుడు స్త్రీలకు కొన్ని రక్షణలు న్యాయంగా ఏర్పరచవలసి వున్నా అలా జరగలేదు.

ఒకానొకప్పుడు తాతల తండ్రుల ఆస్థులు అనుభవించే అదృష్టము పురుష లక్షణమేనైనా ఇప్పుడు వారికట్టి సంపూర్ణ అదృష్టము లేదు. సోదరీ మణులతో ఆ అదృష్టము పంచుకోవలసి వచ్చింది. దానితోపాటు అగ్ని

సాక్షిగా వివాహమాడిన భార్యను "నా యింట్లోనుంచి వెళ్ళిపోనక్కరలే"దనే దర్జాను కూడా విడనాడవలసి వచ్చింది. వద్దు వెళ్ళమంటే సతీమణి నాల్గు కన్నీటిచుక్కలు ధారగా కార్చి వెళ్ళినా శుభ్రంగా హాయిగా రెండు మెతుకులు వండుకొని తినగలదు. కాని ఆమె ఆపని చేస్తే పాపము పతివర్యులు గ్రాసమునకు ఏదో ఏర్పాటు చేసుకొనక తప్పదు. ఇదివరకు పట్టణాలలోగాని గ్రామాల్లోగాని రహదారులన్నీ వారికొరకే నిర్మింపబడినట్లు చేతులూగించుకుంటూ నడిస్తే యిప్పుడు 'టిక్కు టాకు' మని నడిచే మానవ జాతిని చూస్తూ వారు వెళ్ళిన తరువాత వారి వెనుక వెళ్ళవలసి వస్తున్నది. కార్లు విమానములు నడపటము వైద్యశాలలలో ఆపరేషన్లు చేయుట, మొదలగు పనులుగాని, లోకసభ, రాజ్యసభలలో గుర్రుపెట్టే సౌభాగ్యముగాని మంత్రి రాయబార పదవుల నలంకరించే ధీమాగాని నేడు పురుష లక్షణాలు కావు. ఇలా పురుష లక్షణాలన్నీ నశిసిపోయి, సర్వము వదిలించుకున్న దౌర్భాగ్య దీన జనులకు ఏమన్నా పురుష లక్షణాలంటూ మిగిలాయా అని మీకొక అనుమానము రాక తప్పదు. వుద్యోగము వున్నా లేకపోయినా (లేకపోవడమే గౌరవము) భార్యను కుబేరునిలా భరించటము పురుష లక్షణమే అని సోదరీమణులు అనక తప్పదు. ఈ రోజుల్లో భారతవనిలో వుద్యోగము బానిస లక్షణమట !- దీనిమీద వాదోపవాదాలు వివరించటము ఆరంభిస్తే అది పత్రికా వ్యాసము కాదు డాక్టరేటుకి థీసిస్ అవుతుంది. ఏది ఎట్లావున్నా భార్యా బిడ్డలను పోషించటము ఇంకా పురుషలక్షణమే. వాళ్ళని నానా బాధలు పెట్టినా, నిలువటానికి నీడా, త్రాగటానికి గంజి పోసి భరింపవలసినది భర్తే. ఈ ఘనకార్యము నిర్వహిస్తున్నందుకు గర్వపడటము పురుష లక్షణమే.అది ఏ దిక్కుమాలిన స్త్రీ అయినా చేస్తుంటే ఆమె ఎంతో సిగ్గుపడటము స్త్రీ లక్షణము!

ఎప్పుడు ఎక్కడ యుద్ధము ఆరంభ మవుతుంది, ఎట్లా ఆరంభమవుతుంది, కొరియాలో కొరివి పెట్టె దెట్లా, ఇరాక్ లో అగ్గి పెట్టెదెట్లా అని ఆలోచించగల హక్కు మరియొక పురుషలక్షణము.

ఏ నిముషమైనా టింగురంగా మని బయలు దేరగలశక్తి పురుషలక్షణము. మును పు శ్రీరాముల వారి పుష్పక విమానము భక్తులకొఅకు పంపితే ఆ భక్తుని అర్ధాంగి ఇల్లు అలికి ముగ్గుపెట్టి ఇల్లుసర్ది కాని బయలుదేర లేకపోతే ఆ విమానములో భక్తుడు ఒక్కడే వెళ్ళవలసి వచ్చిందట. పాపము ఆబిడ అల్లా ఇంట్లో ఇల్లు అలుకుతూ ముగ్గు పెట్టుకుంటూ వుండిపోవలసివచ్చింది. ఏ నిముషములోనైనా రాత్రయినా పగలైనా కేన్వాసు బ్యాగుతో చిటికెలో ఎక్కడకైనా బయలు దేరగలగటము పురుషలక్షణము. బయలుదేరింతరువాత ఎందుకు బయలు దేరింది, అక్కడ ఏమి చేయవలచింది, తనుభరించే వాళ్ళగతి ఆలోచించు కోటము పురుష లక్షణమే.

బజార్లో పోతూవుంటే అడుక్కుతినేవాడు జలగలాగా పట్టుకుని వదలకపోతే భార్యామణి నయాపైసా కొరకు వెతుకుతూవుంటే చేతికందిన అణో, బేడో పావలానో (బిచ్చగాడి అదృష్టము కొద్దీ) అందినది గిరాటువెయ్యటము పురుషలక్షణమే, దొర్లిపోయే గుమ్మడి కాయలు చూడకుండా జారిపోయే ఆవగింజలను పట్టుకోటము స్త్రీ లక్షణము. పదునైదవ తారీకువరకు లెక్క చూచుకోకుండా జీతమురాళ్ళు వాడిన తరువాత మిగిలినది భార్యకిచ్చి ఈ నెల జరగాలి ఆ పైకముతోనే అనిచెప్పటము పురుషలక్షణమే.

ఇంద్రుడవు చంద్రుడవు అని పొగడితే ఉబ్బి తబ్బిబ్బు అవటము పురుషలక్షణమే. అతి వినయము నటింస్తూ దాసి, చరణదాసి అంటూ కాళ్ళా వేళ్ళా బడే యిల్లాలునిగాని, పరస్త్రీనిగాని చెంగుపట్టుకొని తిరిగి ఆమెచేత తల మీద చెయ్యి పెట్టించుకోటము పురుషలక్షణమే.

రంగురంగుల పువ్వుల బుష్‌కోట్లు ధరించటము కొత్తగా లిస్టుకు చేర్చబడ్డ పురుషలక్షణము.

కొన్నాళ్ళ వరకు ఉద్యోగము పురుషలక్షణముగా పరిగణించక పోవటము శ్రేయస్కరము. అది స్త్రీ లక్షణముని నేను చెప్ప సాహసించను కాని అది సహజ లక్షణముని వప్పుకొనక తప్పదు. ప్రస్తుత పరిస్థితులలో అది స్త్రీలకు సలక్షణము. స్త్రీల పరిస్థితులు బాగుపడిన తరువాత ఈ ఉద్యోగ విషయము మరల సమాక్షించు కొనవచ్చును. అప్పటివరకూ అది స్త్రీ పురుషులకు సమానమైన లక్షణముగనే పరిగ్రహింపక తప్పదు.

[సంవత్సరానికో శీర్షిక మా లక్ష్మీరఘురామ్ గారికి అలవాటే. వచ్చే వార్షిక సంచిక నుండి యీమె "నేను నేర్చిన విద్య" అన్న శీర్షిక క్రింద వ్యాస పరంపరలు వ్రాస్తారు,]

నూరు సంవత్సరాల :

మహిళల కళాశాల

లండన్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా 1909 నుండి బెడ్ ఫర్డ్ కళాశాలతో సంబంధం కలిగియున్న ప్రొఫెసర్ డరోతీ టారెంటు అనే మహిళచే నూరు సంవత్సరాల క్రితం లండన్ స్క్వేర్ లో స్థాపించబడింది యీ పురాతన మహిళా విశ్వవిద్యాలయం.

లండన్ లోని బెడ్ ఫర్డ్ కళాశాల అతిపురాతనమైన స్త్రీల విశ్వవిద్యాలయపు కళాశాల. 1849 లో శ్రీమతి ఎలిజిబెత్ జెస్సర్ రీడ్ అనే ఆంగ్లవనిత దానిస్థాపకురాలు. అది బెడ్ ఫర్డ్ స్క్వేర్ లో స్థాపించబడటంచేతనే ఆ కళాశాలకి ఆ పేరు వచ్చింది.

1859 నుండి "ది లేడీస్ కాలేజి" అనే పేరు పొంది, కళలు, గణిత శాస్త్రము, ప్రకృతి శాస్త్రము మొదలైన విషయములు విజిటింగ్ అధ్యాపకుల బోధనా సహాయములను పొందుచున్నది.

మొట్టమొదటి విద్యార్థినుల మొత్తం అరవైఎనిమిది. అందరూ పన్నెండు సంవత్సరాలు పైబడ్డ వారే. చాలా మంది ఒకటి రెండు తరగతులు మాత్రమే చదివారు. 1852 లో శ్రీమతి రీడ్ స్త్రీలు విద్యార్థివేతనాలను పొందునట్లు చేసి, ఆ కాలేజిలోని మహిళలకుగాని బయట విద్యార్థినులకుగాని సహాయంగా వుండటానికి రీడ్ ట్రస్ట్ ను ఏర్పాటు చేశారు.

ఆర్థిక కష్టాలు ఇబ్బందు లెన్ని వున్నా కూడా విద్యాబోధన సక్రమంగా జరిగి తరగతులు పెరిగాయి.

1874 లో ఈ కళాశాల బేకర్ వీధిలోని సువిశాలమైన భవంతిలోనికి తరలించబడింది. 1898 లో లండన్ విశ్వవిద్యాలయం స్త్రీలకు పట్టాలను ఇవ్వడం మొదలు పెట్టి సామాన్య శాస్త్రము మొదలైన పాఠ్య ప్రణాళికలు అభివృద్ధి చెందిన తరువాత 1881 లో ముగ్గురు పట్ట భద్రులయ్యారు. 1900 ల సంవత్సరంలో విశ్వవిద్యాలయం పార్లమెంటు ఏక్టు క్రిందకు వచ్చిన తరువాత బెడ్ ఫర్డ్ కళాశాల కళలు, విజ్ఞాన శాస్త్రం నేర్పించే కళాశాలగా గుర్తింపబడింది.

"రాయల్ ఛార్టర్"

విశ్వ విద్యాలయంతో సంబంధంక్రమంగా బలవత్తరమైనది. ప్రిన్సిపాల్ సెనేటు మెంబరు. కళాశాలలో నియమించబడిన ఉపాధ్యాయులు, క్రమశిక్షణ పొందిన ఉపాధ్యాయులు క్రమంగా అధిక సంఖ్యలలో నియమించబడ్డారు. వారు విశ్వవిద్యాలయపు సభలలోను విద్యాశాఖలలోను కూడా వున్నత పదవులు పొందకలిగారు.

ప్రొఫెసర్ (ప్రస్తుతం డేమ్) లిలియన్ పెన్సన్ 1948 నుండి 1951 వరకు వైస్ ఛాన్సలర్ గా పనిచేసింది ఈ వుద్యోగాన్ని చేసిన మొదటి స్త్రీ ఈమెయే.

1909 లో ఈ కళాశాల రాజవంశపు అనుమతిని పొందింది 1913 లో రిజెంట్స్ పార్కులోని సౌత్విల్లా ఎస్టేట్ లో విశాలమైన నూతన భవనాలు నిర్మించబడ్డాయి. ఇవి లండన్ పార్కులలో అతి విశాలమైనవి. 100,000 పుస్తకాలకు మించిన గ్రంథాలయము కళాశాల పూర్వీకుల పేర్లతో చాలా బ్లాకులు, వింగులూ ఈ భవనాల్లోనే వున్నాయి. ట్యూక్ భవనము 1931 లో కట్టించబడింది. మిస్. ఎమ్. జె. ట్యూక్ (తరువాత డేమ్ మార్గరేట్) ప్రధాన వ్యక్తిగా నున్నప్పుడే కళాశాల అన్ని రంగాలోను అభివృద్ధి గాంచింది. అందుచేతనే ఆమె పేరుతో ఆ భవంతి నిర్మించ బడింది.

మూలం : ప్రొఫెసర్ డరోతీ టారెంటు

అనువాదం : మంత్రవాది కామేశ్వరి

1941 లో శత్రువులనీ బాంబులచే కల్గిన నష్టం పూర్తి చెయ్యడమే కాకుండా అభివృద్ధినికూడా పొందింది. (యుద్ధ కాలంలో ఈ కళాశాల కేంబ్రిడ్జికి తర్లించబడింది.) క్రొత్తగా జరిగిన అభివృద్ధిలో ఒక పెద్ద లేబరేటరీ, ఇంకా విశాలమైన నడవలూ పెద్ద రిఫెక్టరీ మొదలైనవి విద్యర్థుల సౌకర్యార్థం కట్టబడ్డాయి.

విజ్ఞానాల్లో చేరినంతవరకు కళలు, ఈ కళాశాలలో పంథొమ్మిది విభాగాలున్నాయి. ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క విశ్వ విద్యాలయ అధ్యాపకులున్నారు. యూనివర్సిటీ డిగ్రీ, డిప్లమోలకు విద్యార్థినులకు తర్ఫీదు ఇవ్వబడు తుంది. పలు విధములైన సోషల్ సర్వీసులలో తర్ఫీదు పొందడానికిగాను మానసిక శాస్త్రంలోను, సాంఘిక శాస్త్రంలోను ఆర్థిక శాస్త్రంలోను తర్ఫీదునివ్వ డానికి ఆర్థిక శాస్త్రశాఖలో తగిన సదుపాయాలున్నాయి. ఈ కళాశాలలో లేని విషయాలపై చర్చలకు మిగిలిన కళా శాలలతో ఏర్పాట్లున్నాయి. పోస్టుగ్రాడ్యుయేట్ రిసెర్చి శాఖలో క్రొత్త అధ్యాపకులను నియమించారు. ఇందుకు ప్రజాస్థిరాశాలు, ఉదారుల ధనసహాయం ఉపకరిస్తోంది. కామన్‌వెల్తు, ఇతర దేశాలలోని పండితులను ఆకర్షించ డానికి సీనియర్ ఫెలోషిప్‌లుకూడా వున్నాయి.

ప్రస్తుతం ఎనిమిది వందమంది విద్యార్థినులున్నారు. పద్దెనిమిది సంవత్సరాలకు లోపు వనితలు మాత్రమే అండర్ గ్రాడ్యుయేట్లగా చేర్చుకో బడతారు. పోస్టుగ్రాడ్యుయేటు పనిలో మాత్రమే పురుషులను చేర్చు కొంటారు. ఉపాధ్యాయ పదవులు మాత్రం స్త్రీ పురుషులకు సమానంగా ఇస్తారు.

ఈ కళాశాలకు వసతులేర్పరచే కళాశాల కాకున్నా ప్రస్తుతం మూడు పెద్ద హాలులందు రెండువందల నలభై విద్యార్థినులకు జీవన సౌకర్యాలను కూడా చేకూర్చు చున్నది. ఒక పెద్ద హాస్టలు కట్టడానికి ఆలోచనలు జరుగు తున్నాయి. జాతీయ అంతర్జాతీయ విద్యార్థినులు చాలా మంది చేర్చుకొనబడుతారు.

ఈ కళాశాల కేంద్ర యూనియన్ ఇరవై ఒక్క-శాఖోప శాఖలుగా పనిచేస్తుంది. చక్కటి ఆటలశాఖలు కూడా వుంది. విద్యార్థినులు యూనివర్సిటి యూని యనులలో ఉపాధ్యక్షుల వంటి పెద్ద పదవులను నిర్వ హిస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థి సంస్కరణల వంటి వుద్యమాలలో పాల్గొనడానికి కూడా తగిన సాంఘిక కార్య కలాపాలున్నాయి.

ప్రపంచంపు అన్ని భాగాలలోను నివసిస్తున్న 'పాత' విద్యార్థినుల సంఘము కూడా వుంది యీ మహిళల విశ్వ విద్యాలయానికి.

★

మాన్య చరిత

నిద్రపోయెడి వారినిద్రను పోగొట్టి
జాగృతి యొనర్చినాడ వీ జాతినంత
అతల్లి గర్భంబు అతిధన్యతను పొంద
దేశవిఖ్యాతితో తేజరిల్లి

పరదాస్య శృంఖలులు పగులగొట్టగ నీవు
సత్యాగ్రహమను శక్తిని ధరియించి
దీక్షచే మహాతత్వదీక్ష చేతనుపూని
కార్యసాధన చేసి గ్రాలినావు

సత్యమను సువ్రతంబు సాధింపజేసి
అస్త్రము నహింసగా పొందితి వమరబాపు
రాట్నచక్రము ధర్మచక్రము కాగ
మాకు బాటను చూపితో మాన్యచరిత !

— కె. సీతాదేవి

స్కెచ్

చిగురించిన ఆశాజ్యోతి

"శ్వారాణి"

కదులుతున్న ఆ కంపార్టుమెంటులో యింకా చాల మంది కూర్చున్నారు. ఆ కదలని కళ్ళలో అతను ఒక్కడే మెదులుతున్నాడు. అంత మందిలో ఎవరి వంకా చూడకుండా, తన వైపే అదే పనిగా ఎందుకు చూడాలి? ఆపదలో వున్నప్పుడు ఆత్మీయులు దగ్గరగా వచ్చి బుజ్జగించినట్లు ఆ చూపులు అతన్ని లాలిస్తుంటే అతని ఆత్మలో ఆశా విశ్వాసాల స్రోతస్సు ప్రవహించింది. అయినా, అతనికెందుకో భయమేసింది! ఆమె ఎవరో తనకు తెలియదు. తనెవరో ఆమెకు తెలియదు. తెలియని రెండు బంధాలకు సంబంధాలను ఏర్పరచి, అనుబంధాన్ని అందించాలని ఆమె కన్నులు ఎందుకు ఆశిస్తున్నాయో. ఎంత ఆలోచించినా అతనికా అంతు చిక్కలేదు. తన జీవిత చరిత్రలో బహుశా ఆ చూపుల దండాన్వయం, అపూర్వ అధ్యాయంగా చిత్రించబడితే, అది నిజమవుతుందా అన్న సందేహం అతన్ని కలవర పెట్టింది. ఇంతకు ముందెన్నడు కోరుకున్నా, ప్రయత్నించినా అటువంటి అనుభూతి సంభవించలేదు. ఒక వేళ జరిగినా అది మధురానుభూతిగా మారలేదు. అపశ్రుతి మాత్రం మేళవించింది.

గుంటూరు స్టేషను వచ్చేసరికి బండిలో చాల వరకు ఖాళీ అయింది. వాళ్ళతో బాటు ఆమె కూడా అచ్చట దిగిపోతే బావుండుననిపించింది.

ఆమె అచ్చట దిగలేదు. పైగా నవ్వుతోంది. అతని మనస్సులో, ఉద్దేశ్యం తేలిగ్గా గ్రహించిందనుకుంటూ, అందుకే నవ్వింది. బెజవాడ దాటి వెళ్తుందేమో! ఆమె ఎక్కడికి వెళ్తే తనకెందుకు? ఆ చూపుల్లో భావాన్ని అర్థం చేసుకోవడం అవసరమేమో? ఆ అవసరాన్ని కాంక్షించడం అతనికిష్టంలేదు. ఆ పెట్టె నుంచి దిగి వెళ్ళిపోవాలనిపించింది. ఆ చూపులు తిరిగి జ్ఞాపకానికి వస్తాయి. పరిత్యజించిన కోర్కెలు మళ్ళీ వాంఛించాలని బుద్ధి పుడుతుంది. సాహసించి, తనేదో సాధించాలని సంకల్పించుకున్నప్పుడు, ఆమె చూపుల్లో అంతర్యాన్ని తాను గమ్యానికి చేరుకునే లోగా తెలుసుకోవాలని నిశ్చయించుకొని, అచ్చటే కూర్చుండిపోయాడు.

మరి కొంత మంది ప్రయాణీకుల్ని భరించి, బండీ కదిలింది. నీలాల లాగ తళతళ మెరసే కళ్ళు, మిల మిల నవ్వుతూ, "ఎందుకు తప్పించుకు తిరుగుతారు." సమక్షంలో సానుభూతి వాక్యాలు పల్కుతున్నాయి. తనకు ఆ కళ్ళను చూచే అర్హతాలేదు. ఆ కళ్ళలో సౌందర్యాన్ని ఆస్వాదించే ఆకారమూలేదు.

అందరి లాగ తను విశాల ప్రపంచంలో ఒక మానవుడే అందరు కోరుకున్నట్లే, తను ఆశలను పరచుకొని. కోర్కెలను తెరచుకొని, వాటి కార్యనిర్వాహణకోసం వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నాడు.

ఆశలు అడియాశలయ్యాయి.

కోర్కెలు కన్నీటితో కరిగిపోయాయి. సమాజం దృష్టిలో అతడొక భయంకరమైన స్వరూపంగా తయారయ్యేడు. మంచి, నిర్ణయించలేని మానవతలేని సమూహంలో కురూపిలాగ కన్పించాడు.

ఇహ... తాని.... తను విషాధ పరిదగ్ధ జీవితం మిగిలాయి. భవితవ్యంలో తనకు ఆనందము సంతోషము, వినోదము, వికాసము, భగవంతుడు శేషించలేదని నిర్ధారణకు వచ్చి, చీకటి ముసుగులో నిర్వేదిస్తున్నాడు. వాంఛలను విడిచిపెట్టివేశాడు.

తల్లిదండ్రులు తన వివాహం తలపెట్టినప్పుడు, పెళ్లి కూతుర్ని చూడ్డానికి వెళ్లేముందు అద్దంలో తన మొహాన్ని చూచుకున్నాడు. తన మొహాన్ని తనే చూచుకోలేకపోయాడు. భయంతో వొళ్ళంత కంపించిపోయింది. చేతిలో వున్న అద్దం, నేలమీద పడి తునాతునకలయిపోయింది. ఆ పగిలిన ముక్కల దగ్గరకు వచ్చి, వొంగి చూశాడు. ఇంతకు ముందు అద్దంలో ఒక ముఖం, ఇప్పుడు అనేక ముఖాలు! అక్కడ ఒక్క క్షణం నించోలేకపోయాడు.

కాని ఎంత వద్దని వాదించినా, తల్లిదండ్రుల బలవంతం వల్ల. పెళ్ళి కూతుర్ని చూడ్డానికి బయలుదేరాడు. తనకు వివాహం జరిగితే, ఆ అమ్మాయి ఎంతగా కుమిలి

పోతుందో వూహించుకునే లోగా, పెళ్ళి కూతురు అచ్చట నుంచి లేచి వెళ్ళిపోయింది. పెళ్ళి కూతురు తరపు వాళ్ళు, అమ్మాయికి అబ్బాయి నచ్చలేదని చెప్పడం జరిగింది.

మరొక సంబంధం విషయంలో, "ఒకవేళ అతనితో పెళ్ళి జరిగితే ఉరి తీసుకొని చస్తాను" అని పెళ్ళి కూతురు నిద్రహారాలు లేకుండా నాల్గు రోజులు నిరశన వ్రతం పట్టింది!!

గడిచిపోయిన సంధర్భాలు మదిలో మెదిలేసరికి అతని కళ్ళు చెమ్మగిల్లాయి. అవమానంతో నిష్ఠూరాలతో వివర్ణమై పోయిన అతని ముఖం, ఆమె ఆలోచనలను భావాలను మ్రింగేసి, ఆమె వంక చూడలేక పోయింది. అతని వేదనలను కన్నీటితో కడిగివేయాలనే కాంక్ష ఆమె కళ్ళలో కదులుతోనే వుంది.

"మిమ్మల్ని వేధిస్తున్న బాధ మీ సహృదయం నాకు చెబుతోంది. మీ అంతః సౌందర్యాన్ని అర్థం చేసుకునే అవకాశం భగవంతుడు నాకిచ్చాడు. మీరు అందరి కంటె అందంగా వుంటారు. అందుకు నా కళ్ళే సాక్ష్యం. ఇటు చూడండి." ఏ మాత్రం ఉద్వేగాన్ని గాని చాంచల్యాగాని ప్రకటించ కుండా, ఆ కళ్ళు నిట్టూర్పునెత్తావి దొంతరలతో కబురు పంపుతున్నాయి, ఆమె ప్రయత్నంలో తాత్పర్యం అర్థం కాక, ఆమె పరిహసిస్తుందని, తన వికృతాన్ని మరొక విధంగా గేళిచేస్తుందని అనుకున్నాడు.

"వొద్దు. ఈ సమాజానికి దూరంగా వుండవలసిన నన్ను, మళ్ళా పిలచి అవమాన పరచవద్దు. అందరి ముందు నిలబెట్టి, నా వికృతస్వరూపాన్ని బహిరంగ పరచవద్దు." అతని హృదయాన్ని చీల్చుకొని, వెలువడిందో మూగ ఆక్రందన.

"అంతరాత్మలో దాగి వున్న సత్యాన్ని చూడగలుగుతున్నాను. నా కళ్ళ ముందు మీరొక అద్భుతవ్యక్తులుగా కన్పిస్తున్నారు. మీ మంచితనాన్ని చూడగలిగే అదృష్టం అంత తేలిగ్గా అందరికి లంభించదు." ఆమె కళ్ళతో ఆనందం మెరసింది.

మంగళగిరి స్టేషను వచ్చింది. ఆమె కళ్ళను వొత్తుకొని, కిటికీలోనుంచి కొండ మీద వున్న గోపురాన్ని చూచి నరసింహస్వామికి నమస్కరించింది. అతని వంక

"స్వామికి మనసార అంజలిచ్చి అర్థించండి. మీ మనస్సులో వున్న దిగులుపోతుంది." హసిస్తున్న ఆమె కళ్ళలో కోర్కెను కాదనలేక, అతఉతన్మయుడై నమస్కరించాడు. కళ్ళు తెరచి చూచేసరికీ, ఆమె చీర చెంగుతో కళ్ళను తుడుచుకుంది. అతని మనస్సు ఆనందంతో స్పందించి, ఉద్రూతలూగింది.

ఆ కళ్ళు మనస్ఫూర్తిగా నవ్వాయి. ఆ కన్నులలో చిరునవ్వు వెన్నెలలు ఈసారి స్పష్టంగా చూడగలిగాడు.

"ఎక్కడికి వెళ్ళినా ఈ కళ్ళు మిమ్మల్ని వెతుక్కుంటూనే వస్తాయి. ఆ సంగతి మరిచిపోదల్చుకుంటే, మిమ్మల్ని వేధిస్తున్న సమస్యకు సమాధానం యిహ వుండదు." ఆ కళ్ళలో యింతకుముందున్న శాంతము, సరళము యిప్పుడు లేవు. తన భయ కంపిత హృదయాన్ని విడిపోని అనుబంధాలతో కట్టి, తనకు మళ్ళా పునర్జన్మ సిద్ధింపజేయడానికి తొందరపడుతున్నాయి.

తాడేపల్లి స్టేషను వచ్చినా, అతడు కదలలేకపోయాడు. బండి కదలి, కృష్ణానది వంతెనమీద మెల్లిగా పరుగెడుతోంది.

కృష్ణవేణి తరగల మెరపు మాటున దాగివున్న సౌందర్యాన్ని, అతని కళ్ళు చూస్తుంటే, ఆమె చిలిపిగా నవ్వింది, కలలుకంటున్న ఆ కళ్ళ వెనక ధర్మనిలయంతో ఆఖరు జీవిత సౌందర్యాన్ని నిర్మించుకున్నాడు. ఆ విశాల నేత్రాంచలాలమీద అతడు ఆశాజ్యోతిని తిరిగి వెలిగించుకున్నాడు.

చీకటిని చీల్చుకొని వెలుగులోనికి వచ్చినట్లు, అతన్ని ఎక్కడికో తారతమ్యాలు, ఎత్తుపల్లాలు, అభిన్న భిన్నత్వాలు లేని దూర దూర తీరాలకు.... దిగంతాల అవతలకు .... ఎవరో తీసుకొనిపోయి.... అమరనాదం విన్పిస్తూ, అమృతాన్ని అందిస్తూ, అతని శరీరాన్ని కళ్ళను, మనస్సును మార్చివేసి కొత్త సౌందర్యాన్ని వికసింపచేసినట్లు.... ఎదో ఒక కల... మరపురాని మధురాతి మధురమైన కల... అతనిముందు. కళ్ళు తెరచి వుండగానే ఏమిటీ మమత? మమత అని చెప్పుకోటానికి కూడా నోచుకోలేని అతడిప్పుడు, మమతాభూయిష్టమయినా మాయలో చిక్కి, జీవితంలో కొత్త మార్గాల వేపు ప్రయాణం చేస్తున్నాడు.

తన ఆలోచనలను చెలా చెదరు చేస్తూ, తన ఊహ

ఆగింది. అతను అక్కడ దిగిపోవాలి. ఆమె ఎక్కడికి వెళ్తుందో తనకు తెలియదు. బండి దిగి ప్లాటు ఫారము మీదకు వచ్చి నిలబడ్డాడు.

ఆమె తర్వాత దిగి, గుమ్మానికి యివతల నిలబడి అతని వంక హృదయపూర్వకంగా దృష్టి మరల్చింది.

"నన్ను మళ్ళా మానవుల్నిగా చేశారు. ఆశలను అడుగడుగునా చంపుకొని, నిరాశలతో నికృష్టంగా బ్రతుకుతున్న చీకటి జీవితానికి వెలుగు చూపించారు. మీ ఋణాన్ని ఈ జన్మలో తీర్చుకోలేను. పునర్జన్మవుంటే నా ఆశ అడియాసకాదు." అతని కళ్ళు కృతజ్ఞత తెలుపుతూ అభినందించాయి.

"రాజమండ్రి వెళ్ళేబండి సిద్ధంగా వుందట. త్వరగా బయలుదేరు." ఆమె తల్లి బండిలో నుంచి దిగి సామాన్లు కూలీలకు పురమాయించి, కూతుర్ని వెంటపెట్టుకొని బయలుదేరింది.

ఆమె చేతిలో వున్న రుమాలు, క్రిందకు జారిపడితే– ఆమె వెనక్కు తిరిగి కడసారిగా అతని కళ్ళలోనికి చూచింది. చేతి రుమాలు తీసుకొని ఆమె కన్పించే వరకు చూచి ప్లాట్‌ఫారం నుంచి కదిలాడు.

మళ్ళీ జీవితంలో ఆమెను కలుసుకోగల్గితే యీ ఋణానుబంధం. ఏ విధంగా సన్నిహిత మవుతుందో యిప్పట్నుంచే ఊహించుకుంటూ, కాలిబాట మీద నడిచి వెళ్ళిపోయాడు........ ★

విలియం సారోన్‌య రచించిన "నీతికథ"

అసంతృప్తికి అంతెక్కడ?

ఆ యింట్లో ఒక పుట్టు గుడ్డివాడు వుండేవాడు. పాపం! గుడ్డివాడు అని యింట్లో అందరూ వాణ్ణి ఎంతో ఆదరాభిమానాలతో చూసేవారు. అయినాకూడా తనని ఎవరూ సరిగా చూడ్డంలేదనీ, గుడ్డివాడుకదా అని లోకువ చేస్తున్నారనీ అతడు వాపోయేవాడు. ఇంట్లోవారు ఏమి చేసినా వాడికి తృప్తి కల్గేదికాదు. అంతా నీరు తాగితే వాడికి పాలుయిచ్చి, అంతా మజ్జిగ పోసుకుంటే వాడికి పెరుగుపోసి, అంతా ఒక ముద్దే తింటే వాడికి కడుపునిండా పెట్టినాకూడా నన్ను సరిగ్గా చూడ్డంలేదని గొణిగేవాడు. ప్రాణం విసిగి ఒకనాడు ఎంత తింటాడో చూద్దామని మేకని పూర్తిగావండి పెట్టారు. రుచిగా వండిన మేక మాంసాన్ని వాసన చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు గుడ్డివాడు. అది చూసి యింటి వాళ్ళు హమ్మయ్యా అనుకొనే సమయంలో గుడ్డివాడి ముఖకవళికలు మారాయి. ఓ క్షణంపాటు ఆలోచించి గుడ్డివాడు అన్నాడు : "నా భాగానికే యింత మాంసంవస్తే మీరు ఎంతెంత తిన్నారో !"

కొత్తసరదా : పాతకారు

హాస్య నాటిక

[ఆవిడ హాల్లో వాలుకుర్చీలో కూర్చుని నవలచదువు కుంటూ వుంటుంది. ఆయన, క్రిందచాపమీద కూర్చుని పాత పేపర్లన్నీ గబగబ తిరగేసి చూసేస్తూవుంటాడు, మధ్యమధ్య నుదుటిమీద చెమటని చొక్కా చేత్తో తుడుచు కుంటూవుంటాడు.]

ఆవిడ : దేనికండీ అంత యిదిగా వెతికేస్తున్నారూ? అర గంటాయి చూస్తున్నాను కదా?

ఆయన : అదేనే .... దానికోసమే.

ఆవిడ ; నాముఖంలాగే వుంది మీ జవాబు....

ఆయన : అదిగో అదే వద్దన్నా. నీ ముఖాని కేమొచ్చె. చక్కగా ముచ్చటగా నయాపైసా ప్రమాణాన్ని దాటిపోయే బొట్టు, దిద్దినట్లున్న కనుబొమ్మలు...

ఆవిడ ; చాల్చాలు, ఎవరేనా వింటే నవ్విపోతారుగాని, ఏమిటండీ అంత యిదిగా వెతికేదీ?

ఆయన : అదేనే .... దానికోసమే....

[మూతి మూడు విరుపులు విరిచి ఆవిడ పక్కన పెట్టిన పుస్తకం మళ్ళీ చేత పట్టుకుని కూర్చుం టుంది]

ఆయన : [హడావిడిగా పేపరొకటి మడిచి చేత ఎత్తి పట్టుకుని] ఇదిగో నే....

ఆవిడ : [కోపంగా] ఏమిటీ?

ఆయన : అదేనే....అదే.... చూడు కొనేసిదా?

ఆయన : నాముఖం. ఏవిటంటే చెప్పకుండా కొనేసీదా అంటే....అవేం శంకరగిరి మాన్యాలా? పుంగనూరు బంట్రోతు పనా?

ఆయన ; హుఁ [ముఖం తుడుచు కుంటూ] యీ మోహాని కెంత చేసినా యింతే!

ఆవిడ : [చర్రున కోపంతో] ఏంచేసేశారేం? మహఁ. నే కాపరాని కొస్తున్నప్పుడు అమ్మపెట్టిన చీరలే యింకా కడుతున్నాను. కన్నెధార పోసిన నగలేపెట్టు కుంటున్నాను. రెండు పూట్లా అన్నంపెట్టి ఆలిని పోషించడమేం? వూరికిఉపకారం అనుకుంటున్నారా? [గెడ్డంకింద రెండు చేతులూ, మోకాళ్ళమీద మోచేతులూ ఆన్చుకుని చూస్తూ కూర్చుంటాడు ఆయన] అవునవును. సమాధానం ఎందుకూ యీ పీనుక్కి! అంత అదృష్టంకూడానా నా ముఖానికి? ఏ రాహు కాలంలో కాలెట్టానో యీ కొంపలో, ఆపేటలో వున్న అమ్మ గారింట ఓపూటేనా భోజనం చెయ్య లేదు. హాయిగా కూర్చుని కబుర్లు చెప్ప లేదు, అడ్డమైన వాళ్ళూ అంటూన్న మాటలు పడుతూ....

[ఏడుపుతో యింకమాటలు పెగలక ముఖానికి చెంగు అడ్డం పెట్టుకుంటుంది]

అయన : అబ్బబ్బ! ఏ మాట చేస్తామన్నా పూర్తిగా వినవు, సరికదా మొదటిమాటతోటే వ్యాఖ్యానంఅందు కుంటావు. యింకీ కొంపలో శుభం ఎలా జరుగు తుంది? ఛీ!

ఆవిడ : [కోపంతో ముఖం జేవురించుకొని] ఛీ, ఛీ అందానికిక్కడేం చతుష్పాదులు లేవు!

ఆయన ; మీ నాన్న చెప్పించిన సంస్కృతం నా మీద ప్రయోగిస్తే ఏం లాభం?....యింతకీ కయ్యానికి కాలు దువ్వడం మాని....

శ్రీమతి రామలక్ష్మి ఆరుద్ర

ఆవిడ : [మాట కడ్డం వస్తూనే] నేనేం కయ్యం లేప లేదు కాలుదువ్వలేదు అనవసరంగా ఆడిపోసుకోకండి.

ఆయన : ఇంక నరేలేవే, నే చెప్పినమాట వింటావా ....

ఆవిడ : [కోపంగానే] చెప్పి అఘోరించండి.

ఆయన : చెప్తాను. తరవాయి ఆ అఘోరించడం ఏమిటో నువ్వే కానియ్యాలి మరి ! [నవ్వుతాడు]

ఆవిడ : [వస్తూన్ననవ్వుని ఆపుకొంటూ] అలాగేలెండి

ఆయన : మరైతే యిది చూశావ్?.... కొనేద్దామనే నిర్ణయించేశాను. మరి నువ్వే మంటావు?

ఆవిడ : నా యిష్టాయిష్టాల సంగతెందుకూ యింక? కొనే యదల్చుకొంటే కొనేసు కొండి. అనగా న్రటా ఆదె వత్తో దాని నెత్తినే పెట్టండి !

ఆయన : [ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ] సదే ! బాగుంది యిదెప్పణ్ణుంచీ,

ఆవిడ : ఈ పుర్రెపుట్టిన దగ్గిర్నుంచీనూ .... ఇదిగో, నన్ను వేధించక ఏం కొనుక్కుంటే నాకెందుకు? ఎవరికి పెట్టుకుంటే నాకెందుకు? మీ యిష్టం వచ్చినట్లు చేసుకొండి.

ఆయన : చెప్పేది పూర్తిగా వినిపించుకోవేమే ! కర్మ, నే కొంటానన్నదేమిటో చూశావా?

ఆవిడ : నేనేం చూడను.........భోజనానికొస్తారా?

ఆయన : [హడావిడిగా పేపర్లు సర్దేసి దొంతర పెట్టేసి, ఖండువా బుజాన వేసుకొంటూ] ఇదిగో వడ్డించెయి. ఓ నిముషంలో చక్కావస్తా. [త్వర త్వరగా వీధితలుపు జేరవేసుకుని వెళ్ళిపోతాడు.]

♦ ♦ ♦

[సెకండ్ హాండ్ ఆటోమొబైల్ డీలర్సు కంపెనీ ముందుగది. ఆయన కూర్చుని వుంటాడు. ఒక ఏజెంటు అతి వుత్సాహంగా ఉన్న అన్ని కార్లను గురించీ చెప్పేస్తూవుంటాడు.]

ఆయన : అదిసరే కాని ఏదో ఒకటి యివాళ మధ్యాన్నానికల్లా ఓ కారంటూ మా గుమ్మంలో ఉంటే చాలు.

వ్యాపారి : అరె, ఆలా అంటారేమిటి? చూడచక్కటి కారు పంపుతాం సార్, రెండువేలు కట్టండి, మిగతా ఐదొందలూ డెలీవరీ అయాక.

ఆయన : ఇంటికి మనిషిని పంపండి చెకు సాను

వ్యాపారి : [చాలా నమ్రత ధ్వనిస్తూ] చెక్కులతో వ్యాపారం మానేసేంసార్, మీరేమీఅనుకోకపోతే....

ఆయన : చంపావుపో, అంతకేష్ ఎవరుపెట్టుకుకూర్చుంటారయ్యా? వెయ్యికి మించి వుండ దెప్పుడూ.... [యింకా విశదంగా చెప్పబోతూ వుండేసే]

వ్యాపారి : క్షమించాలి ఆ వెయ్యి రూపాయలూ యిచ్చెయ్యండి. అంతకివచ్చేకార్లు లేవనుకున్నారా?....రండి చూద్దురుగాని కావలిస్తే....

ఆయన : [మొహమాటంగా] చూడ్డాని కేంలెండి, అంత తక్కువకి కారంటే .... [నసుగుతాడు]

వ్యాపారి : సార్, మీరలా యిదౌకంచి, యిదేం ఆషామాషీ కంపెనీ అనుకుంటున్నారా? వెలతగ్గితే వస్తువు చెడ్డదని అనుకోకండి, మీరే చూస్తారుగా .... ఒప్పుకొండిసార్.

ఆయన : దానికేంలెండి....కాని.....

వ్యాపారి : ఆలా అనకండి సార్. మీరు ఊఁ అనండి, డబ్బుకి మీతోకూడ మనిషిని పంపేస్తాను, ఆ వెనుకనే మీ కారు మీ గుమ్మంలో వుంటుంది. యివాళ బోణీ మీదే సార్, ... ఊఁ అనండి.

ఆయన : ఊఁ ! అనడానికేంలెండి, ఆడవాళ్ళని సంప్రదించి చూద్దామనీ....

వ్యాపారి : [అమిత ఉత్సాహంగా] ఏమిటి సార్. యిలాంటి విషయాలు ఆడవాళ్ళ దగ్గిర చెప్పడ మేమిటీ? వాళ్ళకేకానుక యిచ్చినా సప్రైజుగా వుండాలి! అందులోనేవుంది తమాషా!

అయన : [కండువాతో ముఖం తుడుచుకుని లేస్తూ] సరే, పంపండి మనిషిని. అయితే ఒకటి; ముందు ఐదొందలే చేతికి యిస్తాను. మిగతాది తరవాతె,

వ్యాపారి : ఆలా అనకండీ. ముందు ఏడొందలిచ్చెయండి

ఆయన : [మెత్తపడి] సరే కానివ్వండి.

[ముసి ముసి నవ్వులు నవ్వు కొంటూ ఏజెంటు మలైపిలవడానికి లోపలికి పోతాడు. ఆయన జేబులో డబ్బు తీసి లెక్క పెడుతూ వుంటాడు. వీధిలో రోడ్డుమీద ఒక వ్యక్తి నిల్చొని తదేకధ్యానంతో చూస్తూ వుంటాడు. ఆయన లెక్కలు పూర్తి చేసుకొని ఖండువా సర్దుకొని లేచి గుమ్మం దగ్గిర నిలబడతాడు. రోడ్డుమీద వంకి ...

చూడ్డంతోనే ఉత్సాహంతో ఏదో నిశ్చయించుకున్నట్లు తలవూపి మరుగ్గావెళ్ళి నిలబడతాడు.]

వ్యాపారి : [వస్తూనే] నడుస్తూ వుండండి సార్. కారుని ఆయిల్ చేసి వస్తున్నాడు ఏళుమలై....

ఆయన : సరే, ఎక్కువ ఆలస్యం కాకుండా పంపండి.

వ్యాపారి : ఇదిగో మీ వెనకాలే వస్తాడు.......

ఆయన : ఆఁ ఏంలేదూ, భోజనాలవేళ అప్పుడే దాటిపోతుందా....[బయటికి నడిచివచ్చేస్తాడు. వీధిలో మనిషి కొంచెం దూరంగా నడుస్తూ వెంబడిస్తూ వుంటాడు....ఆయన నడిచి నడిచి యిల్లు చేరతాడు వెంబడిస్తున్న వ్యక్తి ఆ యిల్లు గుర్తుపెట్టుకొని వీధి మళుపులో వున్న తూముమీద కూర్చుంటాడు.]

ఆయన : [దగ్గరగా వేసివున్నతలుపు ఆదరాబదరాగా తోసుకుని లోపలికి వెడుతూ] ఏమేవ్. దిష్టితీయడానికి పారాణినీళ్ళూ కర్పూరం అన్నీ రెడీచెయ్యి. నువ్వు మంచి చీరాగట్రా కట్టుకో. యింకో పదినిముషాల్లో వచ్చేస్తుంది.

ఆవిడ : [విసుగ్గా] ఏవిటావచ్చేది ప్రళయమా? భూకంపమా? భోజనానికి రండీ అంటూంటే గుప్‌చుప్‌గా వీధిలోకి నడిచి....యిప్పుడు రెండుదాటింది. యిప్పుడింక తింటేనేం? తినకపోతేనేం? రెండు పూట్లకీ కలిపి రాత్రి తినవచ్చు. అయ్యగారు అమ్మలక్కలకి పెట్టడానికి అదా! హుఁ. ఏమిమనుషులో!

ఆయన : నీవిసుక్కి వేళా పాళాలేదే. ఏదో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం కొత్తవస్తువ కొనాలని కిందటేడు ఎంత పేచీపెట్టావు?....పోనీ కదా అని....

ఆవిడ : సడే పోనీకధా అని నాకేం మీరు కొనిపెట్టనక్కర్లేదు—

ఆయన : అదికాదే; అందుకే యీసారి యింకా రేపు శుక్రవారం అనగానే యివాళే కొత్త వస్తూవుకి ఆర్డ యిచ్చాను. వస్తుంది.

ఆవిడ : [కుతూహలంగా] అదేమిటండీ, మరీనూ, వస్తువెలా నడిచి వస్తుందండీ,

ఆయన : [గర్వంగా] మరినేనంటే ఏమనుకున్నావు? సరేగానీ....నీ దగ్గరేమాత్రం కాష్ వుంటుందే?

ఆవిడ : [విసురుగా] అసలు సంగతిఆదీ! అలా చెప్పరేం? యీ నాటకం అంతా నా దగ్గరవున్న డబ్బులు గుంజుకోడానికా బాబూ!

ఆయన : అన్నిటికీ నానార్థాలూ తీస్తావేమిటే? నీ డబ్బు నీకు సాయంత్రంలోగా యిస్తే చాలుగా, ఆ కొట్టువాడు కాష్‌గాని పుచ్చుకోట్ట,

ఆవిడ : అఘోరించలేక పోయారు, కాష్ వ్యాపారమే కాని చెయ్యనన్న కొట్లు, ఉత్త దగా కొట్లండీ, రామ రామ, వాళ్ళు బిల్లుకూడా యివ్వరండీ.

ఆయన : బిల్లేం చేసుకుంటావే, నాలిగ్గనా గీసుకోవాలి! సరుకు సరిగ్గా వుంటే చాలదుటే?

ఆవిడ : మీ మొహంలాగేవుంది, బిల్లివ్వని వాడి సరుకు ఎలా బాగుంటుందండీ?

ఆయన : సరేగాని యింతకీ సరుకెంతైతే ఏంగాని. నీ దగ్గిరెంత సొమ్మున్నదీ చెప్పు .... ఓ ఏడొందలు సర్దవే....

ఆవిడ : అయ్యోరామ, ఈ రోజుల్లో ఐదొందలికి అడ్డిగలూ ఒడ్డాణాలూ వస్తూంటే ఏడొందలు దేనికండీ?

అయన : అది అడ్డిగాకాదు. ఒడ్డాణమూకాదు. చూస్తే నీకే తెలుస్తుంది.

ఆవిడ : [వచ్చేస్తూవున్న ఏడుపు అపుకొంటూ] కానివ్వండి, మీ డబ్బు. మీ సంపాదన! అందుకేగా అంత అధారటీగా అడుగుతున్నారు. తీసుకోండి, వున్నదంతా తీసుకోండి. ఎవరిక్కావాలి?

ఆయన : అదికాదే, చెక్కు తీసుకోనన్నాడని కాని, నీ దాచుకున్న డబ్బు కాజెయ్యాలనా! నీ పిచ్చిగాని... నీ ధోరణినీదే కాని ఎదుట వాళ్ళమాట వినవుకదా.... [ఆయన మాట్లాడు తుంటూనే వుంటాడు. ఆవిడ లోపలి గదిలో బీరువా తలుపులు ధమాలున తెరచి ఓ చిన్న పెట్టె చేత్తో పట్టుకొచ్చి ఆయన ముందు పెట్టేసి వెళ్ళిపోతుంది లోపలికి. అదే సమయంలో వీధిలోనించి "సార్" అంటూ కేక]

ఆయన : [పెట్టిమూత తెరుస్తూ] రండీ, ఎవరదీ?

వ్యాపారి : నేనేనండీ, ఏళుమలై నేనూ కారుతెచ్చాం.... పైకం యిస్తె త్వరగా వెళ్ళాలి. కొట్లో ఎవరూ లేరు.

ఆయన : [విసుగ్గా] అయ్యా, అంత ఖంగారుపడకండీ, అసలందుకేకదూ కూర్చుంట! [పెట్టితీసి అన్నీఐదు రూపాయలనోట్లు .... వరసని లెక్క పెట్టూనే వుంటాడు.... యింకా అలా వస్తూనే వుంటాయి. ఏడొందలు లెకపెట్టి యిచ్చేస్తాడు....]

వ్యాపారి : [అందుకుని] వెళ్ళివస్తానుసార్, డ్రైవింగుకి మీరే చూసుకొంటారా?.... [లేస్తాడు]

ఆయన: ఆగండి. ఓసారి ఆకారు చూడవద్దంటారా?.... ఆపని మీరు వుండగానే చేస్తే....

వ్యాపారి: అలా అనకండి. అది మా కంపెనీకే కళంకం మా కేన్వాసుకూడా తెచ్చి కప్పి అట్టిపెట్టాం. దిష్టీ గ్రట్రా తీసి మీకారు మీరు నడిపించు కొండి. వెళ్ళి వస్తాము. [గబగబ అడుగులు వేసు కుంటూ వ్యాపారి వెళ్ళిపోతాడు,]

[వీధి తలుపుతీసి ఆయన వీధిలోకి చూస్తాడు. గుమ్మంముందర కేన్వాసు కప్పివున్న కారుని చూసి సంతృప్తిగా తలవూపి లోపలికి వస్తూనే]

ఆయన: ఏమేవ్, ఎక్కడా?

ఆవిడ: [లోపల్నుంచే] యిక్కడే, బట్టలు సర్దుకుం కుంటున్నాను.

ఆయన: ఎందుకే.

ఆవిడ: యింటికి వెడదామని.

ఆయన: [జాలిగా] వెళ్ళవే. అయినా అన్నీ నీ సర దాలూ, వినోదాలూ తీర్చాలి. అంతేగాని నాకు సరదా లేమిటి?

ఆవిడ: [ఎదురుగా వస్తూ] ఏం సరదాలండీ? ఏం తీర్చేశారు?

ఆయన: అవును. నేనేం తీర్చలేను. నువ్వువెళ్ళు-యీ కారు కొన్నవాడికే యిచ్చేస్తా.

ఆవిడ: [ఆశ్చర్యంగా] కారేమిటండీ:

ఆయన: [ఉత్సాహంగా] మరేమి టనుకున్నావు నే కొన్నదీ? యిద్దరంకూడా ఎన్నాళ్ళగానో సరదాపడు తున్నాంకదా అని కొన్నాను గాని. యిలా నువ్వు మూతి విరుస్తావంటే .

ఆవిడ: [అడ్డొస్తూ] అయ్యో రామ: అదేమిటో- చెప్పారా? చేశారా? నీ దగ్గిరేమాత్రం దాచావంటూ వున్నదంతా వూడ్చి వేస్తూంటే ఏమను కోవాలి చెప్పండి?

ఆయన: సరే అయిందేదో అయింది. అప్పుడే పదుదాటి పోతూంది. ఈవాళొక్కసారేన కారెక్కి అలా...తిరిగి రావద్దూ?

ఆవిడ: మరి డ్రైవరో?

ఆయన: ఎవణ్ణో తీసుకువస్తేపోలే....(వీధిలోకివస్తాడు ఆవిడ లోపలికి వెళ్ళి అలంకరించుకుంటుంది.

(ఆయనికి గుమ్మంలోనే తారసిల్లుతాడు వీధిలో యిదివరలో కాచివున్న వ్యక్తి.)

వ్యక్తి: నమస్కారం సార్. నేను డ్రైవర్ని.

ఆయన: అరె, వెతుకపోయిన తీగె కాళ్ళకడ్డడిందే;

వ్యక్తి: (చిరునవ్వు నవ్వుతూ) కారుకొన్నారు. దానిలో మొదటిరోజు షైరుకి వెళ్ళరూ? ఆ కంపెనీవారు సాధారణంగా క్లైంట్లని నాకే అప్పచెప్తారు:

ఆయన: ఓహో అలా చెప్పండి. ఇదిగో యీ కేన్వాసూ అదీ తీసి అరుగుమీద పడెయ్యండి. అంతా రడీ చెయ్యండి. ఆవిడని పిల్చుకొస్తాను. (లోపలికి వెళ తాడు.)

ఆయన: ఏమే తెములు మరీ, డ్రైవరొకడు వచ్చాడు.

ఆవిడ: ఇదిగో వచ్చేశానండీ, (వస్తుంది. చక్కని చీర కట్టి ఒక చేతినిండా బంగారు గాజులు, యింకో చేతికి రాళ్ళగాజులు వేసుకుని చక్కగాఅలంకరించు కొని వస్తుంది. ఆయన ఆవిడను చూసి సంతృప్తిగా నవ్వుకుంటాడు.)

ఆవిడ: వెడుదురూ, మరీ చిన్నపిల్లలైపోతున్నారు రండి వెడదాం.

(ఇద్దరూ వచ్చి కారు వెనక సీట్లో కూర్చుంటారు. డ్రైవరు ముందు ఎక్కి కూర్చుంటాడు, కారు స్టార్టు చేస్తే భూమ్యాకాశాలు బద్దలు చేసేలా చప్పుడు చేస్తుంది తప్పించి కారు ముందుకి నడ వదు. అప్పటికప్పుడే ఆవిడ ముఖ కవళికలు మారి పోతాయి. ఆయన ఉస్సురంటూ ముఖంతుడుచు కుని కూర్చుంటాడు.)

డ్రైవరు: అయ్యా ఒక్క చెయ్యి వెయ్యాలి.

ఆయన: సరే కానియ్, (దిగి కారు వెనుకనుంచి తోయడానికి ప్రయత్నిస్తాడు.)

డ్రైవరు: అమ్మగారూ మీరిలా ముందు కూర్చుని, చూడండీ, అదుగో ఆ కడ్డీని కాలుతో తొక్కి వుండండి, యిట్టే స్టార్టయిపోతుంది కారు.

ఆవిడ: ఛీ వద్దంటే వినరు. ముందు నిజం చెప్పరు. వెధవ కారు. నే చెప్పలేదూ, అంతా దగాకోర్లండీ అని. (అనుకుంటూనే ముందు సీట్లో వచ్చి కూర్చుని డ్రైవరు చెప్పినట్లే చేస్తుంది.)

ఆయన: (కారు తోస్తూ వగరుస్తూ) చాటయ్యాలు,

ఆవిడ : (కోపంతో మండిపడుతూ) తొయ్యండి, మనకి అవ్వలిసిందే! లేకుంటే బుర్ర కెంత తోస్తే అంతేనా?

(ఇలా యిద్దరూ మాట్లాడుకుంటూ వుండగా, ఎవరికీ తెలియకుండా, హఠాత్తుగా కారు స్టార్టయిపోతుంది. పూతగా కారు -తోస్తున్న ఆయన కాస్తా బోర్లా పడతాడు. ఆవిడతో సహా కారు ముందుకి పోతుంది.]

ఆయన : (ఒళ్ళు దులుపుకొని లేచి అరుగుమీద కూర్చుంటూ) హుఁ కారు సరదా కాస్తా తీరి గూబల్లో కొచ్చింది! ఆ వెధవ డ్రైవరుగాడు ఆపేయనేనా ఆపేయలేదేం కారుని?

మోకాళ్ళమీద కూర్చుని వుంటాడు. బాగా చీకటి పడింది. వీధి దీపాలు పెట్టారు. నిర్మానుష్యంగా వున్న రోడ్డు ఆనిశ్శబ్ద వాతావరణంలో కారేమైందో భార్యేమయిందో అన్న ఆలోచనలతో కాలు కాలిన పిల్లిలా ఆ అరుగుమీద తిరగడం మొదలు పెట్టాడు ఆయన.

దూరంలో ఆవిడ త్వర త్వరగా నడచి రావడం కన్పిస్తుంది. లోపలకివెళ్ళి వీధి లైటు వేస్తాడు.

ఆవిడ : (గుమ్మం ఎక్కి లోపలికి ఒక్క పరుగున పోయి ముఖం చెంగులో దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తుంది.)

ఆయన : (ఆత్రుతగా) ఏమే, ఏమైంది. కార్ను ఆగలేదా?

ఆవిడ : (విదిలించుతూ) అఘోరించండి. అడ్డమైన వాళ్ళనీ నమ్మి నా పీకలమీదికి తెండి; నన్ను వదుల్చు కోవాలంటే- యింటికి పొమ్మనకూడదూ? (ఏడు స్తుంది,)

ఆయన : (అనునయంగా) ఏమైందే చెప్పు త్వరగా, పోలీసు కంప్లెంటేనా యిద్దాం.

ఆవిడ : ఏమనిస్తారూ? కారు కొన్నట్లుగాని, ఫలానా డ్రైవర్నిగాని కుదుర్చుకున్నట్లు గాని ఆధారాలేవీ? డ్రైవరు సొమ్ము డ్రైవరికి ముట్టింది .... చూడండి నా చేతి రాళ్ళగాజు ఎత్తుకు పోయాడు. ఆ కారేమో తూము దగ్గిర పడివుంది. అది కారేమిటి నాముఖం!

ఆయన : [కోపంగా] రాళ్ళగాజులు కాజేశాడా? పోలీసు రిపోర్టిచ్చి తీర్తాను. [వాకిటిలోకి పోబోతూ వుంటాడు]

ఆవిడ : [ఆయన్ను అటకాయించి] చాల్చాలు. ఒక సారి వెళ్ళి తెచ్చారు, నెత్తికి చేతులు. మళ్ళీ ఎందుకూ ఏ స్నేహితుడికో చేబదులిచ్చాం అని నోరుమూసుకు వూరుకోండి. అది మన కారంటే నవ్వుతారు కూడా. దొక్కు! రామరామ!


ఆయన : [నాన్పుడుగా] సరదాతీరదాని కేదైతే నేమ నుకున్నానే, అంతేకాని....

ఆవిడ : ఆఘోరించలేక పోయారు! ఆ సరదా తీర్చు కొందుకి యీ కారే తగలడాలా! రామరామ! మీరు వీధిలో కెడితెచాలు ....యిదంతా నారాత!

ఆయన : [దీనంగా] అంతే నంటావా ఓవిడా?

ఆవిడ : [దీర్ఘంతీస్తూ] ఆ హుఁ ముమ్మాటికీ అంతే, అంతే. అంతే. ఇది నా రాత. రాత. రాత. చాలా? లెండి, పెందరాడే భోజనం చేద్దాం. వెయ్యి రూపా యిలూ వదుల్చు కున్నందుకు విందు భోజనం! లెండి.

ఏం కోసం నూతన రూప రచన




ప్రకృతి రమణీయాన్ని చూచి పులకితులైన భారతీయ హస్త కళానిపుణులు సంప్రదాయ రీతులలో గత ఎన్నో శతాబ్దాలుగా అత్యద్భుతమైన కళా వస్తువులు సృజిస్తున్నారు.

ఆధునిక అవసరాలకు గాను నూతన రూపాలలో, క్రొత్త క్రొత్త వస్తువులు తయారు కావాలి. ఇట్టి కళా వస్తు నిర్మాతల ప్రయోజనం కోసం హస్తకళల సంస్థ ఢిల్లీ, బొంబాయి, బెంగుళూరు, కలకత్తా నగరాలలో డిజైను కేంద్రాలు ఏర్పాటు చేసినది. లోహము, కర్ర, కెంద్రరోటా, కొమ్ము, దంతము, మట్టి, గుడ్డలు మొదలైన వస్తువులు ఉపయోగించి పాత రీతులలో నూతన రూప రచన చేయడము, క్రొత్త నమూనాలు రూపొందించడము ఈ కేంద్రాల పని. ఇలాగ ఆధునిక అవసరాలకు తగిన విధంగా మన సృజనాత్మక శక్తిని వినియోగించుకుంటున్నాము.

ఆల్ ఇండియా
హాండీక్రాఫ్ట్స్ బోర్డు

అందానికి - అలంకారానికి హస్తకళా వస్తువులు

DA—58/181



అందమూ - ఆభరణాలూ

శ్రీమతి సువేణీ కాశ్యప్

అలంకరణలో ఆభరణాలకు మన పూర్వులెంతో ప్రాధాన్య మిచ్చారు. సౌభాగ్యవతియైన స్త్రీ మోయలేనన్ని నగలను పెట్టుకొంటుంది. అంతబరువు మోయటానికామె సుకుమార శరీరము కష్టమనుకోదు. దీనికి మరో కారణము ఆభరణాలంటే ఆడవారికున్న అమితాభిమానమే, నగలమీద ప్రీతి లేని స్త్రీలు బహు అరుదుగా ఉంటారు. పూర్వకాలంలో స్త్రీ పురుష లిరువురు కూడా ఆభరణాలను సమాన స్థాయిలో ధరించేవారు. కాని కాలం మారిన కొలదీ అదొక్క స్త్రీలకే కేటాయింప బడింది. పింగళ సూరనామాత్యుడు ఏడువారాల సొమ్ములు స్త్రీలు ఏమరక ధరించినచో పతి ఆయుషును వృద్ధి చేసిన వారగుదురంటారు. ఏది ఏమైనా పూర్వపు రోజులలో స్త్రీలు ఆపాద మస్తకము ఆభరణాలను ధరించేవారు కాని కాలచక్రములో కలిగే మార్పుల ఫలితముగా చదువుకొన్న స్త్రీలు నగలు పెట్టుకోవట మంటే మోటుతనంగా భావించారు. దాని పర్యాయ పదమే ఈనాటి "సహజ సౌందర్యము" అంటే ఒంటిన ఒక్క నగకూడ పెట్టకుండా సహజ సౌందర్యమును చూపటమన్నమాట. ప్రస్తుతము అది మంచిదో కాదో చర్చించుట మన కార్యము కాదు. 'లోకోభిన్నరుచి': అన్నారు పెద్దలు ఎవరికి నచ్చింది వారు చేయవచ్చు. కాకపోతే, ఆ చేసేదేదో చూసే వాళ్ళకు మరీ వెగటు కల్గించకుండ ఉంటే చాలు.

ఈ రోజులలో నగలు తిరిగి ఫేషను అవుతున్నాయి. చాలా మంది విద్యార్థినులు, విద్యాధికులు కూడ ఆభరణాలను ఆపేక్షతో వేసుకొంటున్నారు. కాని వాని ఉపయోగము ఎంత వరకు. పొందుతున్నారో చెప్పటము కష్టం.

ధరించే ప్రతి చిన్న నగ కూడ మన సౌందర్యానికి వన్నె తెచ్చేదిగా యుండాలి, అలా కాని పక్షములో దాన్ని ధరించటము వ్యర్థము. ఒక్కొక్కరికి ఒక్కొక నగ బావుంటుంది. ఎవరి ముఖ వర్చస్సుకు ఏది బాగుంటుందో. చూసుకోవటము ముఖ్యం. తరువాత ఏది సామాన్యంగా అందరు వాడకుండా ఉంటారో చూడట మవసరము. ఈ రెండు గమనించి నగలు కొనుక్కోవాలి కాని, పక్కింటి అమ్మాయి పెట్టుకుందనీ, ఎదురింటావిడ వేసుకున్నదనో, మనము కొనకూడదు.

తర్వాత సమయా సమయాలను అనుసరించి పెట్టుకోవాలి. మనము చేసే ప్రతీది కూడ సమయా సమయాలను బట్టి చేసినప్పుడే రాణిస్తుంది.

కొందరు సినిమా, పార్కు మొదలగు చోట్లకెళ్ళేటప్పుడు ఒక కంచి పట్టుచీర కట్టుకొని, దానిమీద నాలుగు పేటల చంద్రహారము ఒకటి, మామిడిపిందెల నెక్లెసు ఒకటి, గోవర్ధన గొలుసొకటి వేసుకుంటారు. చేతులకు సరే చెప్పనే అక్కరలేదు. నాలుగు జతల బంగారపు గాజుల మధ్య రబ్బరు గాజులో, లేక మట్టి గాజులో వేసుకుంటారు. కొందరు- అంటే చదువుకొన్నామనుకునే వారు పెళ్ళిళ్ళకు, పేరంటాలకెక్కడికెళ్ళినా ఒక సన్నని జార్జెట్టు చీరో లేక,

నైలాను సారీనో కట్టుకొని, ముచ్చటగా మూడు నగలు పెట్టుకొని, ఒక్కప్పుడవి లేకుండ వెళ్ళుతారు. ఈ రకాలు ఏవైనా వింతగానే ఉంటాయి.

సినిమాలకు మొదలైన చోట్లకు వెళ్ళేటప్పుడు కాస్త నాజూకైనవి కట్టుకొని, నాజూకుగా రెండు మూడు జతల గాజులు, ఒకటి రెండు పేటల గొలుసు వేసుకొంటే బాగుంటుంది. పెద్దలు ప్రక్కన లేకుండ, కేవలము స్నేహితులతోనే వెళ్ళే అమ్మాయిలు కాస్త ఎక్కువ ఫేషనుగా యున్నా పర్వాలేదు. క్రొత్త క్రొత్తగా వచ్చే గాజులు, పూసల నెక్లెసులు, ఫాన్సీ దిద్దులు పెట్టుకోవచ్చు. కాని ఏదైనా ముఖవర్చస్సుకు తగినవి పెట్టుకోవటము మంచిది.

కొన్ని సమయాలలో ఫాన్సీ నెక్లెసులు కాని, దుద్దులు కాని పెట్టుకొనేటప్పుడు తలకట్టును కూడా మార్చాల్సి వస్తుంది. కొన్నిటికి వదులు జడగాని బాగుండదు. కొన్నిటికి రెండు జడలు గాని బాగుండవు. మరికొన్ని నగలకు చుట్ట చుట్టుకొన్నప్పడే అందము వస్తుంది. ఈ నగలను తగినట్లు వాడాలి.


ఈనాడు కొందరు చెవ్వుల అలంకరణలో అమిత శ్రద్ధ తీసుకుంటున్నారు. నిజానికి ముఖాన్ని పూర్తిగా మార్చివేసే కొద్ది అలంకణలలో ఈ చెవు అలంకరణ ఒకటి. ఈనాడు ఈ చెవులకు మాటీలు, పోగులు, పెడ్తున్నారు. ఇది అందరికి బాగుంటుదనలేము. కాని కొంతమందికి చాలా అందాన్నిస్తుంది. అయితే ఇది అన్ని సందర్భాలకు సరిపోదు ముఖ్యంగ కాస్త పెద్ద మనుష్యుల యిండ్లకెళ్ళేటప్పుడు, మర్యాదగా కనిపించాలనుకొన్నప్పుడు బాగుండదు.

తర్వాత కొన్ని కొన్ని నగలు ఒకదానితో ఒకటి కలవవు. కొన్నిటికి మహా వ్యక్తి స్వాతంత్రముంటుంది. అందుకని మనము ధరించే నగలు ఒకదానితో ఒకటి సరిపోయినట్లు చూసుకోవాలి. ఇలా సరిపోయిన వాటిని సెట్ అంటారు. మెడలో పూసల గొలుసు వేసి, చెవులకు బంగారు దుద్దులు పెట్టి, చేతులకు కంకణాలవంటి గాజులు వేస్తే వుండే అందము వేరే చెప్ప నక్కరలేదు!

నగలు ధరించేటప్పుడు ఆలోచించవలసిన మరో విషయం. మర్యాద. మనిషికి మర్యాదను తెచ్చిపెట్టేవి ఏవేనా కొనియాడ దగినవిగా యుంటాయి. నగలను పెట్టుకొనేముందు మనమెవ్వరో, మన స్థితి ఏమిటో మన మర్యాద ఎంతవరకున్నదో ఆలోచించాలి. కొన్ని కొన్ని నగలు మనిషికి లేని మర్యాదను, డిగ్నిటీని, అమరుస్తాయి. మరికొన్ని వున్నవాటిని పూడ్చేస్తాయి గనుక ఈ విషయము -ముఖ్యముగా గమనించాలి.

మరొక విషయం. పూర్వపు స్త్రీలు నగలను రెండు విధములుగా విభజించారు. పెండ్లి కాని కన్య ధరించేవి, పెళ్ళయిన పడతులు ధరించేవి అని. పెళ్ళయిన యువతి నల్ల పూసలను, మట్టెలను, ముక్కుపుడకను తప్పక ధరించేది. కాని ఈనాడవి మోజైనాయి. బహు కొద్దిమంది మాత్రమే నల్లపూసలు వేసుకొంటున్నారు, మట్టెలను పెట్టుకొనేవారు నూటికి యిద్దరైనా యున్నారో లేరో అంటే అతిశయోక్తి కాదు. అవి పెట్టుకొని తీరాలి. కానిపక్షంలో మహాపరాధము. అని అనను కాని, అవి పెళ్ళయిన స్త్రీకి ఒక విధమైన కళనిస్తాయి అంటాను.

ఈ సందర్భములో మరోకటి చెప్పాలి. నల్లపూసలు మోజైనాయి. పెళ్ళయిన పడతులకు మాత్రమే. కాని పెండ్లికాని అమ్మాయిలకవి ఫాషనే! ఎంతలావు నల్ల పూసలు వేసుకుంటే అంత ఫాషను. మన అమ్మమ్మలు కూడా వేసుకోనన్ని వరుసలతో లావుపాటి, నల్లటి పూసలు వేసుకుంటున్నారు. యీనాటి విద్యార్థినులు. ఇవి వేసుకొనటములో అందము రావచ్చు కాని, అందముకోసము ప్రతిదీ చేస్తామా? జీవితములో అందము ఒకటే కాదుగా! నల్లపూసలు స్వతహాగ మంగళ యోగ్యములో లేక మనవాళ్ళు వాటికది ప్రసాదించారోకాని, అవి మంగళ ప్రదముగా పరిగణింపబడుచున్నాయి. కనుక గౌరవింపదగినవి. వాటిని ప్రత్యేకముగా చూసిననాడే కాని, వానికి ఆ గౌరవము నిలవదనో లేకపోతే ఆ ప్రత్యేకత యుంది కనుకనే ఆ గౌరవమువచ్చిందో తెలియదు కాని మొత్తానికి అవి ఒక పెళ్ళయిన స్త్రీలే ధరించేవారు. ఈనాడు ప్రతియొక్కరు వానిని అలా చీరకి మేచ్ అయ్యేందుకు పెట్టుకోవడము వలన వానికి గౌరవహాని కల్గుతుందనక తప్పదు. నగలను తగిన రీతులలో, తగిన సమయాలలో అలంకరించుకోవటము వలన సౌందర్యాభి వృద్ధినే కాకుండా, తగిన మర్యాద గౌరవములను పొందవచ్చును.



బాలరాజ్యం

అవ్వగారి గడ్డి గిత్త

ఎల్. నిర్మలాకృష్ణమూర్తి.

చాలా కాలం క్రిందట ఒక తాత, అవ్వ. ఉండేవారు ముసలి తాత, తారు తయారు చేసి అమ్మేవాడు. అవ్వ ఇంటి పనులు చూచుకొనేది. ఒకనాడు, అవ్వ, తాతని "నాకొక చిన్న గడ్డిగిత్తను చేసిపెట్టవూ?" అని అడిగింది.

అందుకు తాత "ఓసి కొంటెదానా! గడ్డిగిత్తను ఏమి చేసుకోంటావే?" "అని నవ్వాడు." "నేను దాన్ని బీడులోకి తీసుకొని పోయి మేపుకొంటాను" అని మారాం చేసింది అవ్వ. తాత, అవ్వ మాట కాదనలేకపోయాడు. గడ్డితో చక్కని గిత్తను తయారుచేసాడు. దాని ఒంటి నిండా తారు పట్టించాడు.

ఉదయాన్నే అవ్వ గడ్డిగిత్తను వెంటబెట్టుకొని బీడులో వదిలిపెట్టింది. గిత్త ప్రక్కనే నూలు వడుకుతూ పాడుతూ కూర్చుంది.

"మేయవే, మేయవే, మేటి దూడవులే
చిన్నారి నీ మేను చిలికింది నీలాలు
మేయవే మేయవే మేటి దూడవులే
చిన్నారి నీ మేను చిలికింది నీలాలు."

అలాగే పాడుతూ, వడుకుతూంటే అవ్వకు కునుకు పట్టింది. ఇంతలో ప్రక్కనున్న అడవిలో నుంచి అకస్మాత్తుగా ఒక ఎలుగుబంటి పరిగెత్తుకుంటూ గిత్త దగ్గరికి వచ్చింది.

"నీవెవరవు?" అని గిత్తని అడిగింది.

"నేనా తారు పూసిన గడ్డిగిత్తను" అన్నది చిన్న గిత్త.

"నాకు కొంచెము తారు ఇస్తావా? కుక్కలు. నన్ను కరిచాయి." అడిగింది ఎలుగు. గిత్త మాట్లాడలేదు. ఎలుగుబంటికి కోపమువచ్చి ముందు కాలితో గిత్తను ఒక్కదెబ్బ కొట్టింది. ఇంకేముంది? గిత్తకు ఆ కాలు అంటుకు పోయింది. ఇది చూచి అవ్వ మేలుకొని పొలికేకలు పెట్టింది.

" ఓ ముసలాయనా ఇలా రా త్వరగా రా? మన గిత్త ఎలుగుబంటిని పట్టుకొంది." తాత అదరా, బాదరా పరిగెత్తుకువచ్చాడు. ఎలుగుబంటిని పట్టుకొని తీసుకుపోయి. బోనులో పెట్టాడు.

రెండవ నాడు కూడా అవ్వ గిత్తను బీడులోకి తీసుకొని పోయింది. గిత్త ప్రక్కన కూర్చుని పాడుతూ, వడుకుతూ కూర్చుంది. కునికిపాట్లు వచ్చాయి అవ్వకు. ప్రక్కనున్న అడవిలో నుంచి ఒక తోడేలు వచ్చింది. చిన్న గిత్తను చూచి అడిగింది, "ఎవరు నీవు?" అని.

"తారు పూసిన గడ్డిగిత్తను" అంది గిత్త.

"నాకు కొంచెము తారు ఇవ్వవూ, కుక్కలు నన్ను కరుస్తున్నాయి." అని అడిగింది తోడేలు. తీసుకో. అంది గిత్త. తోడేలు తారు తీసుకుందామని తాకిందో లేదో

కాలుకు గిత్త అంటుకుంది. అవ్వకు మెలుకువ వచ్చింది. పెద్దగా కేకపెట్టింది "ఓ ముసలాయనా మన గిత్త తోడేలును పట్టుకుంది." తాత పరిగెత్తుకుంటూ వచ్చి తోడేల్ను ఎలుగుబంటి బోనులో పడేశాడు.

మూడవ రోజు కూడా అవ్వ గిత్తను బీడులోకి తీసుకు పోయింది. ప్రక్కన వడుకుతూ కూర్చుంది పాడుతూ. వడుకుతూ అవ్వ నిద్రపోయింది. అంతలో ఒక నక్క పరిగెత్తుకుంటూ వచ్చి, చిన్న గిత్తని "గిత్తా! గిత్తా! నీవెవరు?" అని అడిగింది.

"నేను తారు పూసిన గడ్డి గిత్తను" అంది గిత్త.

"చాలా మంచి గిత్తవు కదూ, నాకొక సహాయం చెయ్యి. కొంచెం తారియ్యి" అని అడిగింది నక్క.

"సరే తీసుకో", అంది గిత్త. నక్క కూడా తారు తీసు కొనటానికి కాలు జాపింది. చిన్న గిత్తకు అంటుకు పోయింది. అవ్వకు మెలుకువ వచ్చి కేకలు పెట్టింది. తాత పరిగెత్తుకుంటూ వచ్చి నక్కను బోనులో పడేశాడు.

బోనులో ఎలుగుబంటి, తోడేలు, నక్క ఉన్నాయి, తాత బోను కెదురుగా కూర్చొని కత్తిని పదును పెడ్తు న్నాడు. "ఈ ఎలుగుబంటి తోలు తీసి అమ్ముతాను. మంచి ధర వస్తుంది" అన్నాడు తాత. ఎలుగుబంటి ఈ మాట విని 'తాతా నన్ను చంపకు నన్ను వదిలి పెట్టితే తీయని పట్టుతేనె తెచ్చి పెడ్తాను' "అంది నన్ను మోసం చెయ్యాలను కుంటున్నావా? అయితే సరే చూస్తాగా! నీ నమ్మకం" ఈ మాట అని తాత ఎలుగుబంటిని వదిలి. మళ్ళీ కత్తికి పదును పడ్తూ కూచున్నాడు.

తాతా. తాతా కత్తికి పదును ఎందుకు పెడ్తున్నావు అన్నది తోడేలు. నీ తోలు తీసి అమ్మితే చాలా డబ్బు వస్తుంది, అన్నాడు తాత. "తాతా నీకు పుణ్యం వుంటుంది నన్ను వదిలి పెట్టు నీకు మంచి గొర్రెల మందను తెచ్చి పెడ్తాను" అన్నది తోడేలు. సరే మోసము చెయ్యవు కదూ? అని తాత తోడేలును వదిలి పెట్టి మళ్ళీ కత్తి నూరుతున్నాడు.

"తాతా, తాతా, ఎందుకూ కత్తి నూరుతూ ఉన్నావు?" అని అడిగింది నక్క. నీతోలుతీసి డోలుకట్టడానికి అన్నాడు తాతా. తాతా అంత పనిచెయ్యకు. నీకు పుణ్యం వుంటుంది. కోళ్ళు. బాతులు తెచ్చిపెడ్తాను అంది సరే నన్ను వెర్రివాణ్ణి చెయ్యవుకదూ! అంటూ నక్కను వదలిపెట్టాడు.

మర్నాడు సూర్యోదయం కాగానే తాత ఇంటి తలుపు చప్పుడైంది. వెళ్ళి తలుపుతీశాడు తాత ఎదురుగా ఎలుగు బంటి తేనెపట్టు పట్టుకుని నిలబడింది. తాత దాన్ని అందు కున్నాడు. తలుపుతీసి తెనెపట్టును జాగ్రత్త పెట్టాడు. మళ్ళీ ఎవరో తలుపుకొట్టారు. పెద్ద గొర్రెల మందతో తోడేలు నిలబడ్డది. తాత సంతోషంతో గొర్రెల మందను ఒక లానులో వదిలి చుట్టూ కంచెకట్టించాడు. నక్క మటుకు మొగము చూపించలేదు తాతకు చాలా కోపము వచ్చింది. ఎలుగుబంటి తోడేలు ఈ సంగతి తెలుసుకొని నక్కపని పట్టించాలనుకున్నాయి. ఒకదినము ఎలుగుబంటి తోడేలు నక్కను వెతుక్కుంటూ అడవిలో షికారు వెళ్త న్నాయి. నక్క ఒక మేకపిల్లను చంకబెట్టుకొని ఎదురు బడ్డది. తోడేలు నక్కబావా ఎక్కడికయ్యా వెడుతున్నారు? అని అడిగింది

తోడేలు ఏమయ్యా నక్కబావా! ఇవ్వవలసిన సొమ్ము చెల్లించావా? అని అడిగింది.

"ఇంకా అప్పుతో ఉందయ్యా త్వరగా చెల్లించాలి" అన్నది. నక్క

ఇలాగ కొద్ది రోజులు గడిచిపోయాయి. ఒకటి ఎలుగు బంటి తోడేలు మళ్ళీ నక్కను వెతుక్కుంటూ బయలు దేరాయి. నక్క వీటిని చూచి దొడుతీసింది, ఎలుగు బంటి నక్క ఎంత పనిచేసిందో అని తేనెపట్టుఉండే ప్రదేశానికి వెళ్ళి తేనెటీగలను పట్టి ఒక డబ్బాలోతెచ్చి మరుసటి రోజు అదేవేళకు అడవి మధ్యకు ప్రవేశించి తోడేలు నక్క ఎదురుబడ్డది. తోడేలు నక్కతో— నక్కబావా నీకొరకు మేము మంచి తాయిలంతెచ్చాము. అన్నది. నక్క సంతో షంతో ఆ డబ్బానుతీసుకొని ఇంటికీవెళ్ళి భార్యను దగ్గరకు పిల్చి ఒక తాయిలము సంపాదించాను. అని డబ్బామూత తెరిచింది. ఆ తేనెటీగెలు ఝుంకారముచేసుకుంటూ ఆ నక్కబావను. దాని భార్యను కుట్టేశాయి. ఆ నక్కబావ ముఖంఉబ్బిపోయింది, నక్క పశ్చాత్తాపముతో ఈ తోడేలు నన్నెంతపనిచేసింది? అని ఏడుస్తూ తనమనసులో అను కొంది. "నేనుతాతకు ఇవ్వవలసిన సొమ్ముచెల్లిస్తే ఈబాధ వుండదుకదా" అని కోళ్ళు, బాతులు మేసేస్థలానికి వెళ్ళింది నక్కకు ఒక ఉపాయంతోచింది. కోడిని పేరుపెట్టికోడి బావా, కోడిబావా, నేను మాఇంట్లో ఒక విందును చేస్తాను, నీవురావా? అని అడిగింది. కోడి బయలుదేరింది, నక్క దానిని ఇంటికి తీసికెళ్ళి లోపలికి వదిలి గడియపెట్టింది,

నక్క ఇదే ప్రకారంగా ఒక మందకోళ్ళను. ఒక మంద బాతులను చేర్చింది. తరువాత నక్క అమితమైన సంతోషంతో తాత ఇంటికివెళ్ళి తలుపుతట్టింది. చప్పుడికి తాత తలుపు తెరచిచూచేసరికి నక్కఎదురుగాకన్పడ్డిది. "నక్కబావా. ఎంత పనిచేసావు. నన్ను వెర్రివాణ్ణిచేసి వెళ్ళావే" అన్నాడుతాత. నక్క కాళ్ళకు నమస్కారంచేసి నన్ను క్షమించు తాతయ్యా మా ఇంటికిరా వెళ్దాము అని తాతను తీసికెళ్ళింది. తాతదానితో వెళ్ళి ఆ లోపలఉన్న మందను చూచి సంతోషించాడు తాత వెనుక నిలబడ్డ నక్క దౌడు తీసింది. తాత అవ్వల సంతోషానికి అంతులేదు. ఆనాటి నుండి వాళ్ళు ఏటికిఏడు ఎక్కువ డబ్బు సంపాదిస్తూ, ఆరోగ్యాంగా, ఆనందంగా, ఉన్నారు.

చదువు లక్ష్యం

శ్రీ. బి. వి. నరసింహారావు, బి. ఏ. బి. ఇడి.

చదువు వల్ల నీ కన్నీ
సమకూడాలా? లేదా?
లేకపోతే చదువు వట్టి
లోక వంచనమ్మేరాద!!"

సహనము సమరసభావము
చదువు నీకు నేర్పకుంటె
బ్రతుకు బాట నెటు తెలివితొ
పయనము సాగింతువోయి? ॥చ॥

కాలంతో పాటు నీవు
కదలుట అది ఎరుగకుంటె
అందరికంటె వెనకనె
అట్టె నిలిచి పోదువు సుమి!! ॥చ॥

ఎంతో తెలుసునన్నది, నీ
కేగొప్పయుకాదు, నమ్మ:
ఆతెలిసిన దాన్నొకింత
ఆచరిస్తే చాలు సుమ్మ. ॥చ॥


చెప్పగలుగుటె గొప్పని
చేయుట అది మరచిపోకు
చేతలలో చూపని, నీ
చెప్పుటలవి నిష్ఫలమ్మ. ॥చ॥

అన్ని పనులతో నీమము
అందరిపై కడు ప్రేమము
కలిగి నీవు నడచుకుంటె
కావలసిన దేమున్నది? ॥చ॥

వాదములకు, భేదములకు
కాదు చదువు ఉపయోగము:
వాదభేదముల కతీత
స్వాదువర్తనము, ముఖ్యము, ॥చ॥

ఆంధ్ర మహిళా సభ —

ఆవరణలో ప్రతీ రోజూ బీద— బాల బాలికలకు జరుగుచున్న పాల పంపకం-
సెప్టెంబరు —నెలలో 4625 మందికి పాలుపంచబడెను
ఈ పాల పంపకం ప్రతీ రోజు ఉదయం 7 గంటలకు జరుగుచున్నది.
శని, ఆదివారములు నూకల గంజి కూడా పోయుట జరుగుచున్నది.





ఆంధ్ర మహిళా సభ

దసరా వేడుకలు

ప్రతి సంవత్సరం వచ్చినవారంతా విశ్రాంతిగా కూర్చుందుకు తగినంత సదుపాయంగా వుండడం లేదని యీ సంవత్సరపు దసరా ఉత్సవాలు సువిశాలమైన పందిరి క్రింద జరిపించాలని నిశ్చయించారు. నిజమే. దిన దినం పెంపొందుతున్న విద్యాలయపు విద్యార్థినులకే సరిగ్గా సరిపోతుంది మేడమీది హాలు. ప్రతి సంవత్సరం సభ్యులు, సన్నిహితుల సంఖ్య పెరుగుతూంది. కాని. హాలుసైజు పెరగాలిగా! అందుకే యీ సంవత్సరం చాందినీ కట్టిన చక్కటి పందిర క్రింద కలకలలాడుతూ కూర్చున్నారు సభ్యులు.

దసరా సందర్భంలో, చేతిపనుల, లలితకళల, చిత్ర లేఖన ప్రదర్శనలకి యీ సంవత్సరం మద్రాసు మేయరు శ్రీమతి చెరియన్‌గారు ప్రదర్శనలని చుట్టిచూచి మహిళల పనితనాన్ని ఎంతో మెచ్చుకున్నారు. తరువాత సభ్యులందరినీ ఉద్బోధిస్తూ, యిటువంటి కార్యక్రమాలు సన్నిహితత్వాన్ని సేవాతత్పరతని విస్తృతం చేయడానికీ పెంపొందించడానికీ అత్యవసరం అన్నారు. మద్రాసులోనూ యితర ప్రాంతీయ పట్టణాల్లోనూ ఉన్న సేవా సంస్థల సంఖ్యలు దృష్టిలో పెట్టుకొనిచూస్తే, ప్రదర్శనకి యింకా ఎక్కువ వస్తువులు రావాలి. కాని, అలా లేకపోవడం శోచనీయం అంటూ, యిటువంటి కార్యక్రమాలన్నిటిలోనూ, అన్ని సేవాసంస్థలో పాల్గొనాలని అన్నారు శ్రీమతి చెరియన్. తరువాత, అంబర్ విద్యాలయ విద్యార్థినులు మళయాళ నృత్యాన్నొకదాన్ని ప్రదర్శించారు. ఆరోజు కార్యక్రమంలో కుమారి చిత్ర భరతనాట్యం ప్రదర్శించింది. ఆంధ్ర మహిళా సభ నర్సింగు హోము విద్యార్థినులు "విటమినులు" అనే విజ్ఞాన ప్రయోగాత్మకమైన చిన్న నాటికను ప్రదర్శించారు.

రెండవరోజు కార్యక్రమంలో "షష్ట్యబ్దపూర్తి" అనే తమిళ హాస్యనాటిక ప్రదర్శించారు మహిళా విద్యాలయపు విద్యార్థినులు. మాటల ద్వంద్వార్థాల ప్రయోజనంగా కడుపుబ్బ నవ్వొచ్చే నాటకం అది. కుమారి నిర్మల వీణ వాయించింది. కుమారి శశికళ చక్కని నాట్యాలు ప్రదర్శించింది. చిన్నదైనా యీ పాప ప్రదర్శించిన హావభావాలకి పెద్ద లచ్చెరువుకాక తప్పదు.



శ్రీమతి తారాచెరియన్

మూడవరోజు అంబర్ విద్యాలయ విద్యార్థినులు "చౌచౌ" ప్రదర్శనలు యిచ్చారు. వివిధ రాష్ట్రాలకు చెందిన యీ విద్యార్థినులు వారివారి ప్రాంతీయ విషయాలను తీసుకొని చక్కగా ప్రేక్షకుల మన్ననల నొందారు. కుమారి కె. వి. గీత నృత్యప్రదర్శన లిచ్చింది.

ఆఖరిరోజున విచిత్ర వేషధారణ జరిగింది. ఇందులో మహిళ విద్యార్థినులు, సభ్యుల పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తాగినవాడి వేషంవేసి ప్రథమ బహుమతి నందింది సేతులక్ష్మి, రెండవ బహుమతి "పిచ్చిదాని" వేషంవేసిన లక్ష్మికి వచ్చింది. కుమారి లక్ష్మి పున్నమ్మ చక్కటి నాట్యాన్నిచేసి సెబాస్ అనిపించింది. హిందీ నాటకం "బలిదాన్" ప్రదర్శింపబడింది. ఇందు పాల్గొన్న వారందరూ ఎంతో ఉత్తమమైన నటనాస్థాయిని చూపారు. జడ్జీలు దీనినే ఉత్తమ నాటకంగా నిశ్చయించి షీల్డు యిచ్చారు. బహుమతి ప్రదాతగా శ్రీమతి వర్గీస్ నిలచారు. ఉత్తమంగా ఉత్సాహంగా వుండి పనిచేసే సేవా సంస్థలంటే తనకెంతో ఉత్సాహం అని అన్నారామె. శ్రీమతి వర్గీసుగారికి బి. తిమ్మాబాయమ్మగారు స్వాగతం చెప్పారు. బహుమతి ప్రదర్శనం తరువాత శ్రీమతి రామలక్ష్మి తెరుద్ర వందన సమర్పణతోనూ, జాతీయ గీతంతోనూ దసరా వేడుకలు ముగింపబడ్డాయి.

కృతజ్ఞత

శ్రీమతి బేటా లీలా నాయుడుగారు
,, గుమ్మిడిదల వెంకుబాయమ్మగారు
,, లలితా రాజామణిగారు
,, ఎ. సరస్వతిగారు
,, సోమన లలితాబాయిగారు
,, కె. లలితా రాయ్‌గారు
,, దరిసి సుభద్రమ్మ చెంచయ్యగారు
,, మోదవరపు లక్ష్మీనరసమాంబగారు
,, రావు వెంకట సరోజిని దేవిగారు
,, సామర్ల లీలావతిగారు
,, అక్కినేని అన్నపూర్ణగారు
,, కొడాలి అన్నపూర్ణగారు
,, కోకా కామాక్షిగారు
,, బొమ్మిరెడ్డి సుభద్రగారు
,, బి. ఆర్. తులశమ్మగారు
,, రంగనాథన్ రాజ్యలక్ష్మిగారు
,, వీరపనేని కృష్ణకుమారి

మన సభకు చెరియొక నూరు రూపాయలు యిచ్చి యావజ్జీవ సభ్యురాండ్రయినందులకు మా కృతజ్ఞత తెలియజేయుచున్నాము.

దసరా సందర్భమున ఆంధ్ర మహిళా సభకు పలువురిచ్చిన చందాలు

శ్రీమతి శివలెంక కామాక్షిగారు	101	00
,, చిర్ల బాలామణి	100	00
,, వి. లక్ష్మీపార్వతి	35	00
,, ముత్యాలరాణి, వి. భవానిదేవి (ఒక్కొక్కరు రు. 30.)	60	00
,, కమలా వీరరాఘవన్, సి. బి. విశాలాక్షి, వి. కమలమ్మ (ఒక్కొక్కరు రు. 20.)	60	00
,, తూములూరి కమలమ్మ, అక్కినేని మనోహరమ్మ, చిర్ల పుష్పవేణి, చిర్ల కమల. కొంగర శేషు (ఒక్కొక్కరు రు. 25.)	125	00
,, జె. జగన్నాథమ్మ	15	00
,, ఆర్. ఆర్. ఐ. ఐ.	23	00
,, కె. లీలారాణి	11	00
శ్రీమతులు టి. జి. పుష్ప, ఎ, లలిత, ఎస్ ధనలక్ష్మి, ఎ, పర్వతవర్ధిని, ఎ. వరలక్ష్మి, మిసస్ పి. సూర్యనారాయణ, పుష్పావతి చౌదరి, టి. జి. హైమావతి, పి. సంపూర్ణమ్మ, కె. కమలా కేశవరావు, పురం అన్నపూర్ణమ్మ, డాక్టరు పపనాబాయి, పురం అనసూయ, జొన్నలగడ్డ కామేశ్వరమ్మ, ఆర్. రుక్మిణమ్మ, ఎ. లక్షులమ్మ, పి. శకుంతలమ్మ, డి. కనక దుర్గాంబ, దుర్గాబాజీ, బండి గోపాయమ్మ, రాజ్యలక్ష్మి, మహాదేవన్, సీతానాయుడమ్మ, మల్లాప్రగడ సూర్యకుమారి, వై. రాజమ్మ (ఒక్కొక్కరు రు. 10.)	240	00
శ్రీమతి పి. ఇందిర	8	10
,, బి. రేవతి	6	00

శ్రీమతులు శిరోమణి, ఆర్. లలిత, ఎ. సేతులక్ష్మి, అరుణకుమారి, సి. హెచ్. సాలిహా, ఎస్. నాగలక్ష్మి, సి. కె. మైత్రేయి, కె. పొన్నమ్మ, కె. వుదయలక్ష్మి, ఆర్. ఉమ ఎం. వరలక్ష్మమ్మ. జి. లలిత, శ్రీమతి, సౌధామణి, ఎ. సి. మాలతి, రామలక్ష్మి ఆరుద్ర విద్యుల్లత, ఎ. లక్ష్మి, సి. పి. జానకి, వి. రాజ్యలక్ష్మి, ఎ. అనసూయ; బి. కృష్ణవేణమ్మ, రెట్టిగంటి సూర్యనారాయణ, సుందరి శంకరం, కస్తూరి రుక్మిణమ్మ, కస్తూరి రంగ నాయకమ్మ, పాటిబండ్ల సుందరమ్మ, లలితా చెంచయ్య, డాక్టరు అంబుజ, సి. కమలాదేవి, మిసస్ బి. శకుంతలమ్మ, పి. ఎం. రామలింగమ్మ, బి, రంగ, దేశిరాజు రుక్మిణి, మహ లక్ష్మి, అద్దేపల్లి లలితాంబ, పసుపులేటి కన్నాంబ, దుర్గాంబ, తంగిరాల విశాలాక్షి, వి. సుభద్ర, వి. శ్రీనివాసన్, చీలంకూరి వెంకుబాయమ్మ, కె. వి. ఎస్. రామాయమ్మ,

శ్రీమతి బి. ఎస్. రెడ్డి, డి. వీరలక్ష్మమ్మ. జి. తిమ్మాబాయి, జి. రత్నం, శ్రీ టి. రామకృష్ణ, ఎస్. జె. నాయుడు (ఒక్కొక్కరు రు. 5.) 245 00

శ్రీమతులు. ఆర్. లక్ష్మి పి. చంద్రకళ. లత జోగు. సి. హెచ్. పద్మావతి ప్రేమలత కె. శారద, కె. సరసమ్మ, సి. డి. గీతాలక్ష్మి, జి. లీలా, జి. ఎస్. లక్ష్మి, ఎ. సి. అలమేలు, సి. నళిని, ఎమ్. రాధాబాయి, టి. ప్రమీల, కె. సుందరి. టి. సుశీలా, ఆర్. కమలాబాయి, మిసెస్. వెంకటేశ్వరన్. (ఒకొక్కరు రు. 3.) 58 00

శ్రీమతులు. హంసావినోదే, రమాకుమారి, టి, వి. రాధ, కన్నన్‌బాల, బి. గీత బి. ప్రేమ, కె. బి. సుందరమ్మ, ఎస్. కె. సరోజ, ఎస్. జ్ఞానప్రసూనాంబ, పి. ఎస్. సావిత్రమ్మ. ఎస్. మణిబాయి, పి. సరస్వతి. ఆర్. శకుంతల, జి. శివకాము, ఎ. షీలా, ఎ. నాగరత్నం, కె. రాబర్ట్సు, ఆర్. జానకి, కె. లక్ష్మి. ఎమ్. డి. సరోజా, ఎస్, లక్ష్మి., జె. జానకి, పి. వత్సల, ఎం. సచిత, ఎ. వాగీశ్వరి, ఎం. సి. మీనా, డి. మంగళం, ఆర్. బి. నిర్మల, ఆర్. మాలతి, రాజకుమారి డి. బి. వి. రాజలక్ష్మి, కె. సరోజిని, ఎస్. విజయలక్ష్మి, టి. సి. హైమావతి, వి. కృష్ణవేణి, ఎల్. నిర్మలాదేవి, వి. వి, వసుందర, బి. నాగమ్మ, బి. నాగేశ్వరమ్మ- అశ్వినికుమారి. బి. రాజహంస, ఎన్. విజయలక్ష్మి, వి, కోమలవల్లి, వి. కె, సత్యభామ, ఎస్. శ్రీదేవి, ఎం. స్వరాజ్యలక్ష్మి, కె, ధనలక్ష్మి బి. సత్యవతి, ఎస్. లక్ష్మిరాజ్యలక్ష్మి. ఎం, ఎస్. జ్ఞానేశ్వరి. ఎ. సి. మాలతి, సుందరలక్ష్మి, మహాలక్ష్మి, జి. రత్నకుమారి. ఉషాబాల, ఎం, సుశీలా, బి. సత్యవతి, అనసూయ, వి. సావిత్రి బి. గౌరి, వి, భాగ్యలక్ష్మి, ఎ. సరస్వతి, ఎన్. వై. జయలక్ష్మి, ఎం. లక్ష్మిబాయి, కొత్తపల్లి కామేశ్వరి, హెచ్, రాజీబాయి,ఎం. ఎస్. నేసాబాయి, కె. లక్ష్మికుట్టి, (ఒక్కొక్కరు రు. 2) 138 00

శ్రీమతులు డి. కమలం, టి. సరస్వతమ్మ, వై. డి. లీ, పి. ఎం. అన్నమ్మ, జె. కనకాబాయి, కె. సరస్వతి. ఇ. రోహిణి, ఆర్. సంతానమేరి, డి. పద్మావతి, శ్యామల, సులోచన, పి. సుశీల; ఎస్. సీతమ్మ. గిరిజమహాల్, మరియమ్మముత్తు, టి. కున్‌హు, కె. ఆండాళు, పి. డి. అలమేలు, పి. సుశీల, జి, భారతి, త్రిపురవాణి, తంగం, డి. సీత, సి. సావిత్రి, దేవకన్య, ఎ. సరోజ, ఎన్. సుశీల, ఎం. సుబ్బలక్ష్మి, పి. శ్యామల, ఎస్. అనసూయ, కె. సంధ్యారాణి, జి. పార్వతి, కె. శారదాంబ, ఎ.కె. మీనాక్షి, పి. సుశీల, కె. సత్యభామ, జి. వరలక్ష్మి, ఎ. విశాలాక్షి, ఎల్, మంగయార్కరసి, పి. ఉషాదేవి, ఎం. వి, లక్ష్మిదేవిఅమ్మ, ఆర్. కస్తూరి. ఆర్. నిర్మల, ఎస్. అంబుజం, ఆర్. ఉషా, ఎం. శోభ ఎ. కె. వసుంధర, ఎస్. విమల, ఎస్. రేణుక, ఎస్. శోభ, ఎం. రమా, . జ్యోత్స్నాపింగళి, వై. జి. సుధ, పూర్ణిమ, సింతియాదేర్, సేగలక్ష్మి, లీలాస్వామినాథన్, ఎస్. సి. రాధ, ఆర్. శ్యామల. వి. కళావతి, కుసుమకుమారి, ఎం. రమా, ఫె. లీసియా, అరోకమిత్ర. ప్రేమలత, వాసంతిక శ్రీనివాసన్, ఎస్. కల్పకం, పి. లలితాకుమారి, గంగుసుబ్బయ్య, డి. త్రిపురసుందరి, ఎస్ .అలమేలు, సి శాంత, ఎ. ఆర్. వేదప్రియ, ఎ.ఆర్. హేమలావణ్య, ఆర్. టి. సుకన్య, కె. కె. శకుంతల, సి. పి. దీపిక, పి. సుమతి, ఆర్. భార్గవి, కె. కె. ఇందిర, అరుణామిత్ర, బి. విజయలక్ష్మి, బి. కె. సరోజిని. వి. గౌరి, రమామణి. (ఒక్కొక్కరు రు. 1) 85 00

మరి కొందరు సభ్యులు అణాలు, 8, 4, 2, యిచ్చిన మొత్తము. 11 95

మొత్తము 1322 05

ఆంధ్ర మహిళాసభ మద్రాసు

బహుమతుల వివరాలు

నాట్యము: ఎం. చిత్ర, శశికళ, కె. వి. గీత, కుమారి లక్ష్మీపున్నమ్మ.

సంగీతం: (వీణ) కుమారి నిర్మల.

గాత్రం: ఎ. భానుమతి, వసుంధర.

నాటికలు: హిందీ నాటిక "బలిదాన్"కి షీల్డు.

నాటిక:	మొదటిది.	రెండవది.
విటమినులు:	లక్ష్మీకాంతం,	చంద్ర.
షష్ట్యబ్దపూర్తి:	శ్రీమతి,	శకలక్ష్మి.
కన్నాడి:	డి. పద్మావతి,	ఎ. విశాలాక్షి.
మర్చెంట్ ఆఫ్ వెన్నిస్;	జి. శివగామి	ఆండాల్,
బంధన యజ్ఞం:	పి. అన్నమ్మ,	కె. సరస్వతి.
కిసాగౌతమి:	కె. వి. మీనాక్షి,	సుశీల,
బలిదాన్:	జయగుప్త.	జె. జానకి.

విచిత్ర వేషధారణ: మొదటిది: సేతులక్ష్మి. "త్రాగుబోతు."

రెండవది: లక్ష్మి. "పిచ్చిది"

మూడవది: రాజ్యలక్ష్మి, "చాకలి"

నాల్గువది: డి. సుశీల, "ముస్లిమ్."

సంస్థలు: సేవాసదన్; అవ్వయిహోమ్, స్త్రీ సేవాసిందిర్, విజిలెన్సుహోమ్. మద్రాసు స్టేటు సోషల్ వెల్ఫేర్ బోర్డు; హైదరాబాదు హోండీ క్రాఫ్ట్ ఇన్స్టిట్యూట్, రాణీ రాజ్యలక్ష్మి ఇన్స్టిట్యూట్, అంబర్ విద్యాలయ, హాస్టల్, నాగేశ్వర శిశువిహార్, నర్సింగుహోమ్,

దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ప్రత్యేక బహుమతి

బెనారెస్ మెట్రిక్: ప్రేమలతా ధింగ్రా

ఆంధ్రామెట్రిక్: శాంత జ్ఞానేశ్వరి.

మిడ్ వైఫరీ: వ్యాగులమేరీ.

కటింగ్సు, కుట్లు: శ్రీమతి నిర్మల.

మాంటిసోరీ సెక్షన్: జి. శివకామేశ్వరి.

చిత్రకారిణిలు: బి. ఎమ్. దేవకి, ఎం. ధనలక్ష్మి, బి. జి. కృష్ణవేణీ, కె. లీలారాణి, పి. ఆశాలత, సి. హెచ్. అరవింద, బి. శాంత, ఎన్. భారతగీత, జయలక్ష్మి, భారతి, రాణీ పూవయ్యా.

విచిత్ర వేషధారణలో పాల్గొన్న చిన్నపిల్లలందరికి పుష్పగుచ్ఛాలు బహుకరింపబడ్డాయి. అనేక ప్రదర్శనలలో పాల్గొన్న అంబర్ విద్యాలయ విద్యార్థినులందరికి రవికెలగుడ్డలు బహుకరింపబడ్డాయి.

విజయము

కుమారి ఆర్. లక్ష్మి, శ్రీమతి ఎల్. నిర్మల.

ప్రాథమిక హిందీ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారని తెల్పుటకు సంతసించుచున్నాము.

మద్రాసులోని మాతృ సంస్థ ఆంధ్ర మహిళా సభతో బాటు, హైదరాబాద్ బ్రాంచి కూడా అక్టోబరు 20, 21, 22, తేదీలలో దసరా ఉత్సవాలు జరుపుకున్నది. వస్తుప్రదర్శన, బొమ్మల కొలువు, ఏర్పరచ బడినవి. ఈ సభ ఆధ్వర్యాన నడుప బడుతున్న అఖిల భారత చేతి పనుల శిక్షణాలయంలో తర్ఫీదు పొందుచున్న 45 విద్యార్థినులు (ఆంధ్ర, తమిళ, మళయాళ, మైసూరు, పాండిచేరి నుండి వచ్చిన వారు) తాము నేర్చుకొనుచున్న లెదరు, ఫేము, వెదురు బొమ్మలు, అట్టలు, బుక్కుబైండింగ్ పనులు ప్రదర్శించిరి. హైదరాబాద్ పురపౌరులు స్త్రీలు పిల్లలు తండోప తండములుగావచ్చి ప్రదర్శించిన వస్తువులు చూచి ఇంత తక్కువ కాలంలో (3నెలల్లో) ఇంతచక్కటి పనులు నేర్చు కున్నందుకు ప్రశంసించిరి. బొమ్మల కొలువు బహునేత్రోత్సవముగా అమర్చబడినది, రోజూ ఉదయము పూజలు, సాయంకాలము వెరైటీ ఎంటర్‌టైను మెంట్లు ఏర్పరుపబడినవి. 20. తేదీని "భరత మాతటాబ్లో" "అపూర్వ భారతం" తెలుగు నాటిక, మేజిక్, డ్యాన్సు వగైరాలు, 21. తేదీని, "అశోకటాబ్లో" "దేవదాస్" కన్నడనాటకం, "మాయావిలాసం" మళయాళ నాటకం, డాన్సు వగైరా, 22. తేదీని 'పట్టికరన్' తమిళ నాటకం, బోటుకోరస్‌పాట. మోహినీడాన్సు, "సుచిత్రాప్రణయం" తెలుగు నాటకం, విచిత్ర వేషధారణలు, విద్యార్థినులే జరిపి ప్రేక్షకులకు ఆనందము, వినోదము గూర్చిరి.

ఈ ఉత్సవములకు మద్రాసు మాతృ సంస్థ 116 రూ. విరాళము పంపించినది. అనేక సోదరీమణులు, సోదరులు ధనసహాయం, పల్వురు కార్య సహాయంచేసి తోడ్పడిరి. వీరందరి సహాయము, సహకారము, సుహృద్భావములతో 3 రోజుల కార్యక్రమములు బహుఆనందదాయకముగా, ప్రదర్శలు విజ్ఞాన దాయకములుగా జరిగినవి.

ఆఖరు రోజున శ్రీమతి టి. చంద్రమంతిదేవి గారు అధ్యక్షత వహించిరి. బహుమతులు శ్రీమతి భాస్కరరావు నాయ్డుగారు దయతో పంచి పెట్టిరి. కార్యదర్శినుల వందనసమర్పణతో కార్యక్రమము ముగిసినది.

ఆటపాటలలో, నాటకములలోబహుమతులు పొందినవారిపేర్లు, ధనసహాయము చేసినవారి పేర్లు, వసూలైన మొత్తములు ఈ దిగువ పేర్కొన బడినవి.

దసరా చందాలు

ఆంధ్రమహిళా సభ. మద్రాసు	రూ.	116 00
శ్రీ చంద్రా స్టోర్సు (బియ్యము)		35 00
శ్రీమతి కందామాణిక్యాంబగారు		25 00
,, ఎ. శ్యామలాదేవి		20 00
శ్రీ జి. జి. అయ్యర్		20 00
శ్రీమతి బి. తిమ్మాబాయి		15 00
,, ఇ. సి. మయూరాక్షి		15 00
శ్రీ గోళి ఈశ్వరయ్య		11 00
,, పంజాబ్ ఫర్నిచర్ వర్క్సు		10 00
శ్రీమతి వై. లలిత		10 00
,, టి. చంద్రమూర్తి		10 00
,, వి. రామమ్మ		10 00
మిసెస్ బి. వి. సుబ్రహ్మణ్యం		10 00
మిసెస్ కళారాజేశ్వరమ్మ		10 00
శ్రీ సెంట్రల్ ఫైర్ వుడ్ సప్లైర్స్ డిపో		10 00
మిసెస్ ఫేరూంవున్నీసా బీగము		10 00
శ్రీమతి ఎ. జయప్రదాదేవి		5 00
మిసెస్ రత్నం కృష్ణారావు		5 00
శ్రీ కె. భూషణం		5 00
శ్రీ కె. లింగాధరరావు		5 00
,, వి. రంగనాధము		5 00
మిసెస్, చిదానందం		4 00
శ్రీ ఎస్. ఎస్. రాజన్		3 00
,, సి. టి. శాస్త్రి		3 00
శ్రీమతి కె. ఇందిరాబాయి		3 00
హోస్టలైట్సు		17 00
	మొత్తం	393 00

డాక్టరు శృతకీర్తి నాయుడుగారు దసరా సందర్భమున ఒకచలువరాతి తాజమహాలును బహూకరించిరి.

మెసర్సుశ్యామ్ ప్రింటింగు ప్రెస్‌వారు ఆహ్వానపత్రికలను ఛార్జిలేకుండా అచ్చువేసి యిచ్చినారు.

ఈ దిగువవారు వాగ్దానము చేసినవారు.

గోకుల్ కార్పొరేషను, మిల్కుసప్లై సొసైటీ హైదరాబాదు.	రూ. 15	00
అబ్దుల్ హుస్సేను కరింభాయి, బొంబాయి	11	00
ఇందిరా పట్టాభి	5	00
అదీబున్నీసాబేగం	3	00
మిసెస్ దేశ్‌ముఖ్	3	00
ఆర్. లక్ష్మి	2	00
బాల త్రిపురసుందరి	2	00

బహుమతుల వివరాలు

1.	పొటెటోగేదరింగు	మొదటి బహుమతి	శ్రీమతి అంబుజం
		రెండవ బహుమతి	,, వి. రాధ.
2.	మ్యూజికల్ చైయిర్స్	మొదటి బహుమతి	,, రమ్యశ్రీ
		రెండవ బహుమతి	,, మమ్మోరాణి
3.	టగ్ ఆఫ్ వార్	గ్రూపు బహుమతి	కెప్టెన్ ఎన్. పి. ఇందిర బృందము.
4.	రింగుటెన్నిస్	,,	పి సరోజినీ బృందము
5.	బాట్‌మింటన్	,,	శ్రీమతి స్నేహలత బృందం
6.	ఎలిజబెత్ — సర్ వాల్టర్ రాలీ	,,	,, సుందరమ్మ రమ్యశ్రీ
7.	వినోదప్రదర్శనములు, విచిత్రవేషధారణ	,,	శ్రీమతి త్రిపుర సుందరి
		,,	,, అదిబునిస్సాబేగం.

నాటికలు : నటీమణులు

1.	అపూర్వభారతం.	,,	రమ్యశ్రీ
2.	సుచిత్రా పరిణయం	,,	ఆర్. లక్ష్మి, ఇందిరా పట్టాభి.
3.	మాయావిలాసం	,,	టి. లీలావతి
4.	దేవదాసి.	,,	కాత్యాయిని
5.	పట్టికట్టన్	,,	కె. కమల


ఆంధ్ర మహిళా సభ మద్రాసు

దసరా సందర్భంలో సభకు ఒక మైకును బహూకరించిన శ్రీ సేతు రామన్‌గారికి కృతజ్ఞత.

దసరా సందర్భంలో సభకు ఆరు ఫ్లూట్ లైటులను- బహూకరించిన మెసర్స్ కె. పి. ఎలక్ట్రిక్ కంపెనీ శ్రీ నాగన్‌గారికి కృతజ్ఞత.

గానన్ డంకర్లీ అండ్ కంపెనీవారు నూరురూపాయలు విరాళం యిచ్చారు.

★



తెర మెరుగులు (నాటికల సంపుటి)

ప్రాప్తిస్థానం :—శోభ ప్రచురణలు,
విజయనగరం సిటీ.

మూల్యం : 1—50.

ఈ నాటికల సంపుటిలో రంగస్థలాన్ని దృష్టిలో పెట్టుకొని రచింపబడిన ఐదునాటికలు వున్నాయి. "కుక్కపిల్ల దొరికింది" శ్రీ రావి కొండలరావు గారు రాసినది. చదవడానికి కూడా బాగుండే ఫార్సు. విద్యార్థులు రంగస్థలం మీదఒప్పించడానికి అనువుగా హాయిగావుంది. "దొంగ" పోతుకూచి సాంబశివరావు గారి రచన. వయోజన యుచితమై ప్రదర్శనకనువైనది. "తెల్లవారింది" "తెరమరుగునీడలు" "స్త్రీలకు ప్రత్యేకం" నాటకాలు బాగున్నాయి. మొత్తానికీ సంపుటిలోని అన్ని నాటికలూ రంగస్థల ప్రదర్శనార్హత కలవే, ఇటువంటి సంపుటి నందిన శోభాప్రచురణలవారు అభినందనీయులు.

జనవాక్యం (గేయ సంపుటి)

రచయిత : వల్లభనేని కాశీవిశ్వనాథం.

ప్రాప్తిస్థానం: రచయిత, మెయిన్ రోడ్డు, పవరుపేట,
ఏలూరు, ప. గో. జిల్లా.

మూల్యం, —— అమూల్యం

'ఏమండీ యిన్ని తప్పులే?' అంటే 'ఆధునిక కవిత్వములో అచ్చుతప్పులు కన్పించవులే' అన్నాడు మొన్న ఒకాయన, ఆధునిక కవిత్వం వ్యాకరణపు సంకెళ్ళనుండి ఎలా తప్పించుకు తిరుగుతుందో, అలాగే సభ్యతా సభ్యతలనుండికూడా అయితేఎలాగఅన్పిస్తూంది. ఉదహరణకి

సంబంధీకులె సమరయోధులై
మొండిచరచుచూ రెండుగ చీలుచు
బండ వెధవలకు బాకాపట్టుట....

ఇంకోటి....

అన్నదమ్ముల పంపిణులందున
అగమగలేవో అంకురించగనె
బూతుకూతల బుంగలు దులిపే......

ఎవరివో భావాలననుసరించి కొత్త పదాలను వాటికి తొడిగి కవిత్వం అల్లేకంటే హృదయం స్పందించినప్పుడే కవిత్వం రాస్తేచాలు. అది నిలుస్తుంది. పుస్తకం వెల అమూల్యం అన్నారు కనుక, రచయితకు వ్రాస్తే ప్రతులు ఉచితంగా పంపుతారు.

దారా : (జీవిత చరిత్ర)

రచయిత : పగాడాల కృష్ణమూర్తి నాయుడు.
ప్రాప్తిస్థానం : అద్దేపల్లి అండ్ కో, సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరం.
మూల్యం :ఒక రూపాయి.

మొగలు సామ్రాజ్య కాలంలో అందరిదృష్టినీ ఆకర్షించి, అందరి హృదయాలనూ చూరగొన్న మానవ పుంగవుడు దారా ప్రభువు, విద్వాంసుడు, రసహృదయుడు అటువంటి వ్యక్తి జీవిత చరిత్ర రచింప బూనడంలో ఆశ్చర్యంలేదు. దారాను గురించి అనేక పుస్తకాలు వచ్చాయి. కాని యీ చిన్ని గ్రంథం—చారిత్రకుల పరిశోధనల ఆధారంగా జాగ్రత్తగా వ్రాయ బడింది. చదువడానికి ఆహ్లాదకరంగా వుంది. చదవడం మొదలుపెడితే పూర్తి చేస్తేగాని వదలం.

కె. రామలక్ష్మి

విశాలాంధ్ర దినోత్సవం : నవంబరు 1.

ఓ జననీ

ఓ జననీ! నీకిదె వందనమూ
ఓ విశాలాంధ్రమా వందనమూ


నీ నదుల పవిత్రజలమ్ములు
నిండించును బంగరు పంటలు
నీ మధుర క్షీరమ్ములతో
నుబికి నవే భారతలో కవితలు   ఓ.

నీ మందిర ప్రాంగణంలో
నందన వన విహారమమ్మా
నీ యొడిలో పెరిగిన వీరుల
చరితలవే జగతికి వెలుఁగులు   ఓ.

మా నమస్సు లివిగో!
మా మనస్సు లివిగో!
మా కుసుమ్సు లివుమా!
మా తపస్సు ఫలమా!

—శ్రీ చెర్వు ఆంజనేయ శాస్త్రి.

ప్రపంచ బాలల దినం: నవంబరు 14



నేటి బాలలు రేపటి పౌరులు

దేశాన్ని అభ్యుదయ పథాన

నడిపించగల ధీరులు, స్వతంత్రులు,

ఆంధ్ర మహిళ 15వ వార్షిక సంచిక

ప్రకటనల వివరాలు

(ఒక రంగు ; ఒక ముద్రణకు)

నాల్గవ కవరు	...	..	60 రూ.
లోపలి పేజీ	..	...	50 ,,
అర పేజీ	...	...	30 ,,
పావు పేజీ	...	...	20 ,,

కాంట్రాక్టు ప్రకటనలకు ప్రత్యేక ధరలు.

మహిళ ప్రకటన

అంటే

విస్తృతమైన పబ్లిసిటీ * మంచిపనికి మేలు

సంవత్సర చందా : 6 రూపాయలు

7 ఎ రోజరీ చర్చి రోడ్డు మద్రాసు 4.

Edited, Printed & Published by Mrs. K. Lakshmi Raghuram, B.A.,
at the Andhra Mahila Press, Mylapore, Madras 4.